నేటి దినపత్రిక
# సూర్య
## కర్నూలు | నంద్యాల
గురువారం 28 డిసెంబర్ 2023 పేజీలు 8

### టిటిడి తరహాలో శ్రీశైల క్షేత్రాన్ని
# అభివృద్ధి చేయటమే ప్రభుత్వ లక్ష్యం

**శ్రీశైలం,మేజర్ న్యూస్:** తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలోనే శ్రీశైలం క్షేత్రాన్ని మరింతగా అభివృద్ధి చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యం అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి (దేవాదాయ శాఖ)కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. నియోజకవర్గ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డితో కలిసి బుధవారం ఆయన శ్రీశైలంలో రూ.215.04 అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.స్థానిక గంగాధర మండపం సమీపంలో జరిగిన కార్యక్రమములో ముందుగా ఆయా పూజాదికాలు జరిపించి తరువాత శంకుస్థాపన కార్యక్రమం జరిపించి అనంతరం మిగతా 2లో

- ప్రతి ఒక్క సామాన్య భక్తుడికి అన్ని వసతులు కల్పిస్తాం
- రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ
- శ్రీశైలంలో రూ.215.04 కోట్ల అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి,ఎమ్మెల్యే

### అభ్యర్థుల ఎన్నిక పై
- నేటి నుంచి మూడు రోజులు కసరత్తు
- పొత్తులో భాగంగా ఆళ్లగడ్డ,ఆదోనిలు జనసేనకు
- ఆదోని టిక్కెట్ కోసం సినీ నిర్మాత ప్రయత్నాలు

# జనసేనాని దృష్టి



**కర్నూలు, సూర్య ప్రతినిధి :** రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ తరపున పోటీకి పెట్టాల్సిన స్థానాల్లో అభ్యర్థుల ఎంపికపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ దృష్టి సారించారు. ఇందు కోసం నేటి నుంచి మూడు రోజుల పాటు ఆయా జిల్లాల నాయకులు, ఆశావాహులతో సమీక్ష జరపనున్నట్లు తెలుస్తోంది. జనసేన, తెలుగు దేశం పొత్తులో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో రెండు నియోజకవర్గాలు జనసేన పోటీ చేస్తుందని ఆ పార్టీ నేతలు వెల్లడిస్తున్నారు. నంద్యాల జిల్లాలో ఆళ్లగడ్డ, కర్నూలు జిల్లాలో ఆదోని నియోజకవర్గాలను జనసేన పార్టీకి కేటాయించే అవకాశాలు ఉన్నాయని పార్టీ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. కర్నూలు జిల్లాలో ఆదోని స్థానం నుంచి పోటీ చేయడానికి ఇద్దరు, ముగ్గురు నాయకులు ఆశపడుతున్నట్లు వెల్లడవుతోంది. ఆదోని నుంచి గతంలో ప్రజారాజ్యం, జనసేన పార్టీల నుంచి పోటీ చేసి ఓడిన మల్లప్ప ప్రధానంగా మరో మారు పోటీకి ఆసక్తి కనపరుస్తున్నారు. ఆయన మెగా కుటుంబానికి వీరాభిమానిగా పేరొందారు.ఆయన గతంలో ప్రజారాజ్యం పార్టీ తరపున 2009లో పోటీ చేశారు. అపుడు కూడాఆదోని టికెట్ కోసం అనేక మంది ప్రయత్నించినా మల్లప్పకే చిరంజీవి టికెట్ కేటాయించారు. ఆ తరువాత ప్రజారాజ్యం పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసి నప్పటికీ మల్లప్ప చిరంజీవి కుటుంబానికి విధేయునిగా కొనసాగుతున్నారు.ఆ తరువాత పవన్ కళ్యాణ్ జనసేన పార్టీని స్థాపించి తొలిసారి 2014లో పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో కూడా ఆదోని నుంచి మల్లప్పను బరిలో మిగతా 2లో


మల్లప్ప


జనసేన నాయకులు పవన్ కళ్యాణ్‌తో ఇరిగెల రాంపుల్లా రెడ్డి

### మంత్రి పెద్దిరెడ్డితో
# చెన్నకేశవరెడ్డి చర్చలు


ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి


మాజీ ఎంపి బుట్టారేణుక


మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

**కర్నూలు, సూర్య ప్రతినిధి :** రాయలసీమ ప్రాంతీయ సమన్వయకర్త, మంత్రి పెద్ది రెడ్డి రామచంద్రారెడ్డిని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి బుధవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో కలిసి తన అభ్యర్థిత్వంపై చర్చించారు. ఎమ్మిగనూరు నుంచి మాజీ ఎంపి బుట్టా రేణుకమ్మకు టికెట్ ఖరారు చేసినట్లు వార్తలు వస్తున్న సందర్భంలో ఆయన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో భేటీ కావడం చర్చనీయాంశంగా మారింది. ఆయన తన స్థానంలో తన కుమారుడికి టికెట్ ఇప్పించుకోవాలన్న ప్రయత్నాల్లో భాగంగా సీఎంను కలిసే ప్రయత్నం చేయగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో మొదట చర్చించాలని సూచించినట్లు తెలుస్తోంది. దాంతో ఆయన మంత్రిని కలిసి తన కుమారుడికి అవకాశం ఇవ్వాలని కోరినట్లు సమాచారం. కాగా ఈ భేటీపై ఇరువురు నేతల నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. మరో వైపు ఎమ్మిగనూరు నుంచి తమ నాయకురాలు పోటీ చేస్తున్నారని బుట్టా రేణుకమ్మ వర్గీయులు సంబరాలు చేసుకుంటున్నారు. కాగా రాజకీయాల్లో అనేక మలుపులు తిరుగుతూ చివరకు బి ఫారం దక్కించుకున్న వారే అభ్యర్థి అవుతారని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

# అఖిలప్రియను అడ్డుకున్న పోలీసులు

- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమానికి వెళ్లకుండా నిలిపివేత..
- దొర్నిపాడు మండలంలో ఎమ్మెల్యే కూడా పర్యటిస్తుండడంతో ముందస్తు చర్యగా పోలీసుల చర్యలు
- నిరసన వ్యక్తం చేసిన భూమా అఖిలప్రియ
- పట్టుబట్టి భవిష్యత్తుకు గ్యారెంటీకి వెళ్లిన భూమా అఖిలప్రియ
- ప్రజలను కలవనీయకుండా పోలీసులతో అడ్డుకుంటారా..
- ఎమ్మెల్యే గంగుల నాని పై తీవ్ర విమర్శలు చేసిన భూమా అఖిలప్రియ


అఖిలప్రియతో మాట్లాడుతున్న సిఐ

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా దొర్నిపాడు మండలంలోని భాగ్యనగరం గ్రామంలో మిగతా 2లో


అఖిలప్రియ వాహనాన్ని చుట్టుముట్టిన పోలీసులు

### ఆర్టీవో కార్యాలయంలో
# ప్రైవేటు ఆర్మీ

- లైసెన్స్ జారీ అంతా వారి కనుసన్నల్లోనే
- ప్రతి పనికి ప్రత్యేక రేటు
- కన్నెత్తి చూడని ఏసీబీ అధికారులు


ఆర్టీవో కార్యాలయం

**కర్నూలు క్రైమ్, మేజర్‌న్యూస్:** నగరంలోని ఆర్టీవో కార్యాలయంలో ప్రైవేటు ఆర్మీ తయారైందన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఎల్ఎల్ఆర్ మొదలుకొని అన్ని రకాల సర్టిఫికెట్ల జారీ వారి కనుసన్నల్లోనే నడుస్తున్నట్లు విమర్శలున్నాయి. ప్రతిదానికి ఓ రేటు ఫిక్స్ చేసి మిగతా 2లో


ఎల్ఎల్ఆర్ టెస్ట్ నిర్వహిస్తున్న దృశ్యం

సూర్య

గురువారం 28 డిసెంబర్ 2023

# టిటిడి తరహాలో శ్రీశైల క్షేత్రాన్ని అభివృద్ధి చేయటమే ప్రభుత్వ లక్ష్యం

(మొదటిపేజి తరువాయి..)


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ

శంకుస్థాపన ఫలకాలను ఆవిష్కరించారు.రూ.75 కోట్లతో నూతన క్యూ కాంప్లెక్స్ నిర్మాణం, రూ.52 కోట్లతో 200 గదుల వసతి సముదాయం,రూ.35 కోట్లతో సాలుమం డపాల నిర్మాణం,శివం రోడ్డు సుందరీకరణ,రూ.23.40 కోట్లతో శివసేవకులకు వసతిగృహ నిర్మాణం,రూ.7 కోట్లతో వనమెగా వాట్ సోలార్పవర్ ప్లాంట్ నిర్మాణం, రూ.5.85 కోట్లతో దేవస్థాన ఉద్యోగుల నివాస సముదాయానికి విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్,సబ్ స్టేషన్ నిర్మాణం,రూ.5.50 కోట్లతో హేమారెడ్డి మల్లమ్మ మందిరం నుంచి డంపింగ్ యార్డ్ వరకు కాంక్రీట్రోడ్డు నిర్మాణం,రూ.2.60 కోట్లతో వెయ్యి కిలోలీటర్ల వాటర్ స్టోరేజ్ రిజర్వాయర్ నిర్మాణం,రూ.2 కోట్లతో ఐదు వందల కిలో లీటర్ల వాటర్ స్టోరేజ్ రిజర్వాయర్ నిర్మాణం(హఠకేశ్వరం), రూ.1.60 కోట్లతో 500 కిలో లీటర్ల వాటర్ స్టోరేజ్ రిజర్వాయర్ నిర్మాణం (ఫిల్టర్ బెడ్ ఏరియా),రూ.1.98 కోట్లతో కల్యాణ మండపం నిర్మాణం (దోర్నాల),రూ.1.26 కోట్లతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం (దోర్నాల),రూ.99 లక్షలతో అమ్మవారి ఆలయంలో ఉత్తర సాలుమండపాల పునర్నిర్మాణం, రూ.86 లక్షలతో పంచమఠాల చుట్టూ కంచె ఇలా మొత్తం రూ.215.04 కోట్ల అంచనా వ్యయంతో అభివృద్ధి పనులకు చేపడుతున్నారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ శ్రీశైల మహాక్షేత్రానికి భక్తుల రాక గణనీయంగా పెరగడంతో భక్తుల అవసరార్థం రాష్ట్ర ప్రభుత్వం వివిధ అభివృద్ధి కార్యక్రమాలను గతంలో ఎన్నడు లేని విధంగా చేపట్టటం జరుగుతుందన్నారు.సీఎం వైఎస్ జగన్మోహన్రెడ్డి రాష్ట్రంలోని అన్ని ఆలయాల అభివృద్ధిపై అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించి ఆయా ఆలయాల అభివృద్ధికి తీసుకోవాల్సిన పలు చర్యలపై అధికారులకు మార్గ నిర్దేశం చేశారని ఈ మేరకు ఆయా క్షేత్రాలకు వచ్చే భక్తులు ఎటువంటి అసౌకర్యాలకు లోనవకుండా దర్శనం,వసతి,వివిధ సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే శ్రీశైలం దేవస్థానాన్ని అభివృద్ధి పరిచామని భవిష్యత్తులో మరింతగా అభివృద్ధి చేసే దిశగా అడుగులు వేస్తున్నట్లు, దినదినాభివృద్ధి చెందుతున్న శ్రీశైల క్షేత్రానికి భక్తుల రద్దీ పెరిగిందని,ప్రతి ఒక్క సామాన్య భక్తుడికి అన్ని వసతులు కల్పించడమే ధ్యేయంగా కృషి చేస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర దేవదాయశాఖ కమీషనర్ ఎస్.సత్యనారాయణ,శ్రీశైల క్షేత్ర ర్మకర్తల మండలి అధ్యక్షులు రెడ్డివారి చక్రపాణిరెడ్డి, కార్యనిర్వహణాధికారి డి. పెద్దిరాజు, దేవదాయశాఖ చీఫ్ ఇంజనీరు సుసర్ల శ్రీనివాసరావు, దేవదాయశాఖ సూపరింటెండెంట్ ఇంజనీరు సి.పుల్లయ్య, డా. వేదాంతం రాజగోపాలచక్రవర్తి, ధర్మప్రచార పరిషత్,దేవదాయశాఖ వారు అదే విధంగా ధర్మకర్తల మండలి సభ్యులు మఠం విరూపాక్షయ్యస్వామి,జి. నరసింహారెడ్డి, ఎం. విజయలక్ష్మి, మేరాజోత్ హనుమంతునాయక్, ప్రత్యేక ఆహ్వానితులు తన్నీరు ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

**మంత్రి కొట్టు వర్సెస్ ఎమ్మెల్యే శిల్పా :** శ్రీశైలం దేవస్థానం పరిధిలో బుధవారం రూ.215.04 కోట్ల అభివృద్ధి పనులకు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక కార్యక్రమంలో స్టేజి పైన దేవస్థాన అభివృద్ధి విషయంలో మంత్రి కొట్టు సత్యనారాయణ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డిల మధ్య జరిగిన సంభాషణలు చర్చకు దారితీశాయి.క్షేత్ర పరిధిలో సత్రాల నిర్మాణాల నిర్వాహకులు రూ.50 లక్షలు డిపాజిట్ చేయాలని మంత్రి నిర్ణయాన్ని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి ఆక్షేపించారు.ట్రస్టు బోర్డు నిర్ణయాన్ని కాదని అలాంటి నిర్ణయాలు సరికాదని ఈ ప్రాంతంలో అంతా పెద్ద మొత్తంలో డిపాజిట్ చేసే పరిస్థితి లేదని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి మంత్రికి సూచించారు.స్టేజి పైనే ఇరువురి మధ్య జరిగిన సంభాషణను గమనించిన అందరూ మంత్రి వర్సెస్ ఎమ్మెల్యేగా అభివర్ణించారు.కాగా చివరగా తామంతా ఒకే కుటుంబం అని కొన్ని భిన్నభిప్రాయాలు ఉన్న అందరం దేవస్థాన అభివృద్ధి కోసమే కృషి చేస్తామని మంత్రి పేర్కొనడం గమనహార్థం.

# ఆర్టీవో కార్యాలయంలో ప్రైవేట్ ఆర్మీ

(మొదటిపేజి తరువాయి..)

వసూళ్లు చేస్తున్నట్లు సమాచారం. ఆర్టీవో కార్యాలయంలో ఇంత జరుగుతు న్నా అటు వైపు ఏసీబీ అధికారులు కన్నెత్తి చూడటం లేదన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

**అంతా ప్రైవేటు వ్యక్తుల కనుసన్నల్లోనే..! :** ఆర్టీవో కార్యాలయంలో ప్రైవేటు వ్యక్తులదే హవా నడుస్తోంది. ఎల్ఎల్ఆర్ మొదలుకొని అన్ని రకాల సర్టిఫికెట్ల జారీలో వారి ప్రమేయం ఉంటుందోన్న విమర్శలున్నాయి. ఆన్లైన్ ద్వారా కాకుండా వారి సిఫారసు చేసిన వారికే సర్టిఫికెట్లు, లైసెన్సులు జారీ చేస్తున్నారన్నది బహిరంగ రహస్యం.

**కార్యాలయానికే పరిమితమైన ఆర్టీవో.. కనిపించని తనిఖీలు :** వాహనాల ఫిట్నెస్, అక్రమ రవాణాపై ఆర్టీవో కార్యాలయ సిబ్బంది తనిఖీలు చేయాల్సి ఉంది. అయితే కార్యాలయానికే సిబ్బంది పరిమితమైనట్లు తెలుస్తోంది. తాము ఏర్పాటు చేసుకున్న ప్రైవేటు సైన్యంతో అమ్యామ్యాలు వసూళ్లు చేస్తున్నట్లు సమాచారం. ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు సంబంధించిన బస్సులకు ఎలాంటి ఫిట్నెస్ లేకపోయినా చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న సమాచారం. రాత్రిళ్ళ సమయంలో టిప్పర్ల ద్వారా హెవీ లోడు తరలిస్తున్నా ఆర్టీవో అధికారులకు పట్టడం లేదు. ప్రతి నెలా దాదాపు 45టిప్పర్ల యజమానులతో ఒక్కో టిప్పర్కు రూ.7వేల నుంచి రూ.10వేల వరకు వసూళ్లు చేస్తున్నట్లు సమాచారం. ఓ మధ్యవర్తి తద్వారా ప్రతి నెలా 7వతేదీలోపు ఈ తంతు సాగుతున్నట్లు తెలుస్తోంది. 7వతేదీలోపు అమ్యామ్యాలు ఇవ్వకపోతే ఆ టిప్పర్పై ఆర్టీవో అధికారులు దాడులు నిర్వహించి రూ.లక్ష వరకు జరిమానా విధిస్తున్నారని తెలుస్తోంది. ఆర్టీవో కార్యాలయంలోని ఓ వ్యక్తి ఇదంతా నడిపిస్తున్నట్లు సమాచారం.

**కన్నెత్తి చూడని ఏసీబీ అధికారులు :** ఆర్టీవో కార్యాలయంలో ఇంత పెద్ద ఎత్తున అవినీతి జరుగుతున్నా గత కొన్నేళ్లుగా ఏసీబీ అధికారులు ఆ కార్యాలయం వైపు కన్నెత్తి చూడటం లేదన్న విమర్శలున్నాయి. ఆర్టీవో కార్యాలయం నుంచి ఏసీబీ అధికారులకు అమ్యామ్యాలు అందుతుండటం వల్లే ఆ శాఖ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఏసీబీ అధికారులు ఆర్టీవో కార్యాలయంలో జరుగుతున్న అవినీతి తంతుపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# అభ్యర్థుల ఎంపికపై జనసేనాని దృష్టి

(మొదటిపేజి తరువాయి..)

నిలిపారు. ఆ ఎన్నికల్లో కూడా మల్లప్ప ఓటమిపాలయ్యారు. తాజాగా మరో మారు జనసేన తరపున పోటీకి నిలబడే ప్రయత్నంలో మల్లప్ప తన వంతు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఈయనకు పోటీగా సినీ నిర్మాత ఒకరు బిజెపి నేత, మాజీ ఎంపి సహకారంతో ఆదోని టికెట్ కోసం కృషి చేస్తున్నట్లు వెల్లడవు తోంది. టిడిపితో పొత్తులో భాగంగా గెలవగలమన్న ధీమాతో సినీ నిర్మాత పోటీకి సిద్ధపడినట్లు తెలుస్తోంది. దీంతో ఆదోని టికెట్ ఎవరికి వస్తుందోనన్న ఆసక్తి జనసేన నేతల్లో కనిపిస్తోంది. కాగా ఆళ్లగడ్డ స్థానం నుంచి పోటీ చేయడానికి ఇరిగెల రాంపుల్లారెడ్డి ఆసక్తితో ఉన్నారని తెలిసింది. ఆయన ఇటీవలే జనసేనలో చేరిన సంగతి విదితమే. మరో వైపు ఆదోని, ఆళ్లగడ్డ స్థానాలను పొత్తులో జనసేన పార్టీకి కేటాయించారన్న వార్తల ను ఆయా నియోజకవర్గాల టిడిపి నేతలు ఖండిస్తున్నారు. వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ జనసేనకు కేటాయించరన్న విశ్వాసాన్ని వారు వ్యక్తం చేస్తున్నారు. జనసేన, టిడిపి పొత్తు అంశంపై జనసేనాని పవన్ కళ్యాణ్ పార్టీ నేతలతో జరిపే సమీక్ష అనంతరం స్పష్టత వస్తుందని భావిస్తున్నారు.

# అఖిలప్రియను అడ్డుకున్న పోలీసులు

(మొదటిపేజి తరువాయి..)

పర్యటించేందుకు వెళ్తున్న మాజీ మంత్రిభూమా అఖిలప్రియ, భార్గవ రాం నాయుడు,భూమా జగత్ విఖ్యాత్రెడ్డిలను ఆళ్లగడ్డ రూరల్ సీఐ హనుమంతు నాయక్ ఆధ్వర్యంలో పోలీసులు చింతకుంట్ల సమీపంలోని హెచ్ పి పెట్రోల్ బంక్ వద్ద అడ్డుకున్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి భూమా అఖిలప్రియకు పోలీసుల మధ్య వాగ్వి వివాదం జరిగింది. తాను ప్రజలతో కలిసేందుకు వెళ్తున్నానని దానికి మీ అనుమతి తీసుకోవా లనా అని ఆమె ప్రశ్నించారు. తాను వెనక్కు వెళ్లే ప్రసక్తే లేదని భూమా అఖిలప్రియ పోలీసులకు స్పష్టం చేశారు. పోలీసుల చర్చల అనంతరం ఆమె భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమానికి భాగ్యనగరంవెళ్లారు.అక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ నా వాళ్ళతో కలిసేందుకు వంద మంది పోలీసులతో అడ్డుపడుతున్నారని ఆమె ఆరోపించారు. నేను ఏమి తప్పు చేశానని పోలీసులు నాకు అడ్డుపడుతు న్నారని ఆమె ప్రశ్నించారు.వైకాపావాళ్లు పోలీసులనువాడుకుంటున్నారని ఆమె అన్నారు. ప్రశాంతంగా ప్రజలను కలిసేందుకు వెళ్తుంటే నాకు వస్తున్నా ఆదరణను చూసి వైకాపా వాళ్లు తట్టుకోలేకపోతున్నారని అఖిలప్రియ ఎద్దేవా చేశారు. పోలీసుల బందోబస్తు లేకుండా మీరు తిరగగల రా అని ఆమె ఎమ్మెల్యేను ప్రశ్నించారు. ఎమ్మెల్యేకు పోలీసుల బందోబస్తు ఇస్తున్నారని, మాకు ఏమీ ప్రొటెక్షన్ ఇవ్వడం లేదని భూమా అఖిలప్రియ ఆరోపించారు. ప్రజలు కట్టే పన్నులతోనే ప్రభుత్వం జీతాలు ఇస్తోందని ఆమె అన్నారు. ప్రజలను తాను కలిసేందుకు ముందస్తు అనుమతి తాను పోలీ సులు నుండి తీసుకోవాలా అని అఖిలప్రియ అన్నారు. గ్రామాలకు వెళ్లకుండా ఆపడం తగదన్నారు. తాను అన్నిటికి సిద్ధమై వచ్చానని, కేసులకు భయపడేది లేదని ఆమె స్పష్టం చేశారు. జగన్ను చూసి మీకు ఓట్లు వేశారు. కానీ మీ ముఖాలు చూసి కాదన్నారు. ఏమన్నా అంటే ఫ్యాక్షనిజం చేశామని గొప్పలు చెప్పుకుంటున్నారని, మీరు చేసేది ఫ్యాక్షనిజం కాదని, రౌడీయిజం, గుండాయిజం అని అఖిలప్రియ ఘాటుగా విమర్శించారు. ఆడపిల్లను అడ్డుకునేందుకు పోలీసులను వాడుకుంటున్నారా నీవు ఎమ్మెల్యేగా అన్ ఫిట్ అని అఖిలప్రియ విమర్శించారు. శాంతి భద్రతల సమస్య ఉంటే పోలీసులు ముందుగానే నోటీసులు అందజేయాలని ఆమె అన్నారు. ఇకనుండి ఎమ్మెల్యే తిరిగే గ్రామాలే తాను పర్యటిస్తారని తగ్గేదే లేదన్నారు. మీ ఇంట్లో అవినీతి జరుగుతా ఉంటే నీవు ఆపలేకపోయావని భూమా అఖిలప్రియ ఆరోపించారు. భాగ్యనగరం గ్రామంలోకి నీవు ఎలా వస్తావో నేను ఇక్కడే ఉంటానని అఖిలప్రియ ఘాటుగా హెచ్చరించారు.

# సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం


బహిరంగ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

**ఓర్వకల్లు, మేజర్న్యూస్:** ఓర్వకల్లు మండలంలో ఉపాధి హామీ పథకం కింద నిర్వహించిన పనులపై బుధవారం ఉపాధి హామీ కార్యాలయంలో సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో శివనాగప్రసాద్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని డ్వామా పీడీ అమర్నాథ్రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా వివరాలను సామాజిక తనిఖీ బృందాలు సమావేశంలో వెల్లడించాయి. సామాజిక తనిఖీల్లో రూ.36వేలు అవినీతికి జరిగినట్లు తెలిపాయి. ఈ మొత్తాన్ని రికవరీ చేయాలని పీడీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ మాధవిలత, ఏపీడీ లక్ష్మణ్, ఏవీవో ఆదినారాయణ, ఏపీవో కుమార్సాయినాథ్, జడ్పీటీసీ రంగనాథ్గౌడ్, సింగిల్విండో ప్రెసిడెంట్ చంద్రశేఖర్రెడ్డి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

# మంత్రి ఇంటిని ముట్టడించిన అంగన్వాడీలు

**డోన్రూరల్, మేజర్న్యూస్:** రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా రాష్ట్ర ఆర్థిక శాఖమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్రెడ్డి ఇంటిని బుధవారం అంగన్వాడి వర్కర్లు, ఆయాలు ఏఐటియుసి ఆధ్వర్యంలో ముట్టడించారు. అనంతరం ఏపి మీట్ కార్పోరేషన్ చైర్మన్ ఎం.శ్రీరాములుకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కోకన్వీనర్ జులేఖ, ఏఐటియుసి నియోజకవర్గ కార్యదర్శి జి.అబ్బాస్లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడిల పట్ల చిన్నచూపు చూడడం దారుణమని, ఈ ప్రభుత్వానికి సరైన గుణపాఠం చెప్పడానికి సిద్ధమౌతున్నట్లు తెలిపారు. విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ప్రత్యామ్యాయ మార్గాలు చేస్తామని చేసే బెదిరింపు ప్రకటనలకు భయపడేదిలేదని వారు హెచ్చరించారు. కావున అంగన్వాడిల సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే సమ్మెను మరింత ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నాయకులు ఎన్కె.రామ్మోహన్, సెక్టార్ లీడర్స్ సుగుణ, స్వర్ణ, మంగమ్మ, సరస్వతి, జయలక్ష్మి, నీరజ, నాగేంద్రమ్మ, శ్రీదేవి, అంగన్వాడివర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.




# మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

**కర్నూలు నగరం, మేజర్న్యూస్:**

మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు డిమాండ్ చేశారు. బుధవారం నగర పాలక సంస్థ కార్యాలయం ముందు ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగాల పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరవధిక సమ్మెలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్రెడ్డి 2019 ఎన్నికలకు ముందు అసెంబ్లీలో, పాదయాత్రలో మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులను వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 6నెలల్లో పర్మినెంట్ చేసి సమాన పనికి సమాన వేతనం చెల్లించి పర్మినెంట్ సిబ్బందికి సీపీఎస్ను వారంరోజుల్లోనే రద్దు చేస్తామని హామీ ఇచ్చి విస్మరించారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ అప్పటి మున్సిపల్ శాఖ మంత్రులైన బొత్స సత్యనారాయణ, ఆదిమూలపు సురేష్, మున్సిపల్ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి వై.శ్రీలక్ష్మి, డీఎంఏ కోటేశ్వరరావులను అనేకసార్లు కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగిందన్నారు. అయినా స్పందించలేదని, తక్షణమే ప్రభుత్వం స్పందించి సమానపనికి సమాన వేతనం చెల్లించాలని, పర్మినెంట్ చేయాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నగర అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్దేశాయ్, రామాంజనేయులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కార్యకర్తలకు మద్దతు తెలిపిన టిడిపి



**బేతంచెర్ల, మేజర్‌న్యూస్ :** అంగన్వాడీ కార్యకర్తల సమస్యల పరిష్కారానికై చేపడుతున్న సమ్మెకు బేతంచెర్ల తెలుగుదేశం పార్టీ నాయకులు బుధవారం మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి పార్టీ జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు పోలూరు వెంకటేశ్వర రెడ్డి , మండల కన్వీనర్ ఉన్నం ఎల్లా నాగయ్య , పట్టణ టిడిపి అధ్యక్షురాలు బుగ్గన ప్రసన్న లక్ష్మి, ప్రధాన కార్యదర్శి షేక్షావలి చౌదరి, నియోజకవర్గ గౌరవ సలహాదారులు కాకర్ల తిరుమలేశ్ చౌదరి మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రంలో చిరుద్యోగులను చిన్న చూపు చూస్తూ వారి జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని అన్నారు. జగన్మోహన్ రెడ్డి తాను పెంచి పోషించుకున్న వాలంటరీ వ్యవస్థ సమ్మెకు పిలుపునివ్వడం చూస్తుంటే జగన్మోహన్ రెడ్డి పాలన ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చని అన్నారు. 40 సంవత్సరాల నుండి అంగన్వాడి కార్యకర్తలు సేవ చేస్తున్నారని వారిని ఇలా చిన్నచూపు చూడడం తగదని అన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి పార్టీ తప్పక విజయం సాధిస్తుందని వచ్చిన వెంటనే న్యాయపరమైన డిమాండ్లను వెంటనే పరిష్కరిస్తామని భరోసా కల్పించారు .ఈ కార్యక్రమంలోబుగ్గనపల్లి రమేష్, జాకీర్ మాజీ ఎంపీటీసీ , మేకల నాగరాజు, ఎస్టీ రవీంద్ర నాయక్, భీమారెడ్డి, జావాజి వెంకటేశ్వర్లు, కౌన్సిలర్స్ రామాంజనేయులు, రామ్మూర్తి, రూబిన్, మల్లిపెద్ది నాగేశ్వర్ రెడ్డి,గూటం శివ, మంచినీళ్ల సుమంత్, చింతకాయల విజయ్ కుమార్, జనసేన నాయకులు మధు, జగదీష్, నాగరాజు, కానాల అంజి, తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీల గోడు జగనన్నకు పట్టదా

## పాదయాత్రలో ఇచ్చిన మాట నిలబెట్టుకో జగనన్నా

**ఆలూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కి అంగన్ వాడీలు చేపడుతున్న నిరసన లు కనపడడం లేదని పాదయాత్రలో ఇచ్చిన హామీలను అడుగుతున్నామని ఈ ముఖ్యమంత్రి కళ్ళు,చెవులు,నోరు మూసుకొని ఉన్నారని అంగన్ వాడీలు విమర్శించారు. బుధవారం ఆలూరు లోఇచ్చిన హామీలు నెరవేర్చమని 16 రోజు అంగన్ వాడీలు సిఐటియు అద్వార్యంలో చేపట్టిన నిరసన లో కళ్ళు,చెవులు,నోరు మూసుకొని నిరసన తెలిపారు.ఈ సందర్బంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కెపి.నారాయణస్వామి,ఏపి అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు జయశ్రీ,బాలరంగమ్మ,ప్రభావతి,భారతి మాట్లాడుతూ జగనన్న మా నిరసన చూడడం లేదు,వినడం లేదు,మాట్లాడడం లేదని ప్రభుత్వం చర్చల పేరుతో బెదిరింపులకు పాల్పడితే బెదిరేది లేదన్నారు.అధికారం కోసం మాయమాటలు చెప్పి నమ్మించిన



కళ్ళు,చెవులు,నోరు మూసుకొని నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత మాటమార్చడం మీకే తగునని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కనీసవేతనం 26,వేలు,రిటైర్డ్ మెంట్ బెనిఫిట్ 5లక్షలు,పెన్షన్ 50 శాతం,ఉద్యోగ భద్రత వంటి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.కార్యక్రమంలో సిపిఎం నాయకులు క్రిష్ణ,మైనా,గోవర్ధన్ అంగన్వాడీ లు పాల్గొన్నారు.

## సఫోర్టు ఫర్ సొసైటీ ఆధ్వర్యంలో
# ఉచితంగా పేదలకు వైద్య పరీక్షలు

**ఆలూరు, మేజర్‌న్యూస్ :** తెదేపా జిల్లా అధికార ప్రతినిధి సఫోర్టు ఫర్ సొసైటీ చైర్మన్ బెంగుళూరు కిషోర్ ఆధ్వర్యంలో అనంతపురం కు చెందిన కిమ్స్,సవేరా ఆసుపత్రి వైద్యులు ఆలూరు వాసవి కన్యక పరమేశ్వరి ఆవరణంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పేదలకు గుండె కు సంభందించిన వైద్య పరీక్షలు ఈసిజి,టు.డి.ఈ కో తో పాటు పలు వైద్య పరీక్షలు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్పంచ్ అరుణాదేవి సహకారం తో సొంత ఊరు ఆలూరు లో పేదలకు వైద్య సహాయం అందించాలని స్వచ్చంద సంస్థ సహకారం తో ఉచిత వైద్య



శిబిరాన్ని నిర్వహించా మన్నారు. కార్యక్రమంలోరఘురెడ్డి, హరిరెడ్డి, మిలిటరీ మహేష్,బలరాం చౌదరి,బెట్టింగ్ రాజు,టిడిపి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# మండలంలో కుష్టువ్యాధి కేసులను గుర్తించండి

**మహానంది, మేజర్‌న్యూస్ :** మహానంది మండలంలోని ప్రతి గ్రామంలో సర్వే నిర్వహించి కుష్టువ్యాధి కేసులు వుంటే గుర్తించాలని ఏయన్ఎం, ఆశాలను, ఆరోగ్య కార్యకర్తలను మండల వైద్యాధికారులు ఆదేశించారు. బుధవారం ఈ వ్యాధిపట్ల తీసుకోవాల్సిన ప్రత్యేక శ్రద్ధపై డాక్టర్ భగవాన్ దాస్, డాక్టర్ శాంతిప్రియ, ఎంపీహెచ్ఈఓ హుసేన్ రెడ్డిలు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తిమ్మాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి సూచనలు, సలహాలు జారి చేశారు. కుష్టువ్యాధిని గుర్తించి వాటి నిర్మూలనకు ప్రతిఒక్కరు పాటు పడాలన్నారు. అశ్రద్ధ వహించకుండా చ ర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# బహుమతులు ప్రధానం

**కోసిగి, మేజర్‌న్యూస్:** మండల కేంద్రమైన కోసిగిలో క్రికెట్ విజేతలకు వైకాపా నాయకులు నాగరాజు, రైల్వే స్టేషన్‌మాస్టర్ లక్ష్మయ్య బహుమతులను ప్రధానం చేశారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా జూనియర్స్‌కు ఎమ్మెల్యే తనయుడు ధరణీధర్‌రెడ్డి సహకారంతో మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు మాంతేష్‌స్వామి, జగదీష్‌స్వామి ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించినట్లు ఆర్గనైజర్‌లు జీవా, నరసింహులు తెలిపారు. ఈ పోటీల్లో దాదాపుగా 20జట్లుకుపైగా పాల్గొన్నాయన్నారు. అయితే బుధవారం ఫైనల్‌లో యస్‌యస్‌జి, బ్లాక్‌స్కాడ్ జట్లు పోటీ పడ్డాయి. ఈపోటీల్లో యస్‌యస్‌జి జట్టు విజయకేతనం ఎగురవేసింది. రెండవస్థానంలో బ్లాక్‌స్కాడ్ జట్టు నిలిచింది. గెలుపొందిన విజేతలకు షీల్డ్‌ను అందజేశారు.



బహుమతులను ప్రధానంచేస్తున్న దృశ్యం





వేటగాళ్ల అరెస్టు చూపుతున్న అధికారులు

# వన్యప్రాణుల వేటగాళ్లు అరెస్టు... రిమాండ్

**మహానంది, మేజర్‌న్యూస్ :** మహానంది మండల పరిధిలోని చలమ రేంజ్‌లో వన్య ప్రాణులను వేట గాళ్లయిన ఏడుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఫారెస్టు రేంజర్ ఈశ్వరయ్య తెలిపారు. బుధవారం ఆయన తెలిపిన వివరాల మేరకు ఆదివారం చలమ రేంజ్ పరిధిలో అనుమానాస్పదంగా పదిమంది తిరుగుతుండగా వారిని పట్టుకున్నామని అందులో ఏడుగురు దొరికి ముగ్గురు పరారైనట్లు తెలిపారు. అనుమానితులను విచారించగా వన్యప్రాణుల వేటగాళ్లుగా నిర్ధారణ కావడంతో కోర్టుకు హాజరు పరచి రిమాండ్‌కు పంపామన్నారు. వేటగాళ్ల వద్దనుండి రెండు నాటు తుపాకులు, నాలుగు చరవాణీలు, కత్తులు, మందు గుండు సామాగ్రి స్వాధీనం చేసుకున్నామన్నారు. అటవిలో అనుమానంగా తిరిగినా వన్యప్రాణులను వేటాడినా కఠిన చర్యలు తప్పవని అన్నారు. సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ నాగేంద్ర నాయక్, ఎఫ్ఎస్ఓ ఎల్లమ్మ, ఖాసీం నాయక్, విజయలక్ష్మి, గార్డు మద్దిలేటి స్వామి తదితరులు వున్నారు.



స్వాధీనం చేసుకున్న మారణాయుధాలు

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరికీ గాయాలు

**ఎమ్మిగనూరుటౌన్, మేజర్‌న్యూస్ :** ఎమ్మిగనూరు మండల పరిధిలోని ఆదోని రోడ్డులోని బనవాసి సమీపంల వద్ద ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. చికిత్స నిమిత్తం గాయపడిన వారిని ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో సిఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ వీరప్పతోపాటు మరో వ్యక్తికి గాయాలు అయినట్లు తెలుస్తుంది. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సిన.

# ఇరువర్గాలపై కేసు నమోదు

**పాములపాడు, మేజర్‌న్యూస్:** పాములపాడు మండలం వానాల గ్రామంలో క్రిస్టమస్ వేడుకల్లో గొడవ చేసుకున్న వారి పై కేసులు నమోదు చేసినట్లు పాములపాడు ఎస్సై జి అశోక్ తెలిపారు ఆయన తెలిపిన వివరాల మేరకు క్రిస్టమస్ పండగ పట్టి విషయంలో ఘర్షణ జరిగినట్లు తెలిపారు ఈ ఘర్షణలో వంక ప్రభాకర్ ఫిర్యాదు మేరకు 9 మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు మరో వర్గం వంక వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు మరో 9 మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

# విచారణ చేసిన పోలీసులు

**కోసిగి, మేజర్‌న్యూస్:** మండల పరిధిలోని వందగల్లు గ్రామ పాఠశాల విద్యార్థిని అదృశ్యంపై పోలీసులు బుధవారం విచారణ చేపట్టారు. విద్యార్థిని అదృశ్యంపై తల్లిదండ్రులు చేసిన ఫిర్యాదుకు తమకు న్యాయం జరుగలేదంటూ విలేకర్లముందు వాపోవడం జరిగింది. దీనిపై సూర్యపత్రికలో రావడంతో సిఐ ఎర్రిషావలి ఆదేశాల మేరకు యస్ఐ సతీష్‌కుమార్ వందగల్లు గ్రామానికి వెళ్ళి విద్యార్థిని తల్లిదండ్రులతో విచారణ చేపట్టడం జరిగింది. దాదాపుగా రెండుగంటలపాటు విచారణ చేపట్టి విద్యార్థిని పాఠశాలలో కూడా విచారణ చేయడం జరిగింది. విద్యార్థిని తల్లిదండ్రులు, విద్యార్థిని తమకు జరిగిన అన్యాయాన్ని పోలీసులకు తెలపడం జరిగిందన్నారు. ఈ విషయంపై యస్ఐ సతీష్‌కుమార్‌ను వివరణ అడుగగా జిల్లా అధికారుల ఆదేశాల మేరకు విద్యార్థిని, తల్లిదండ్రులతో విచారణ చేపట్టామని నివేదికను పై అధికారులకు పంపిస్తామని తెలిపారు.

# క్రైస్తవ సోదరులకు అండగా ఉంటాం

## రామిరెడ్డి తనయులు - పాస్టర్లకు దుస్తులు పంపిణీ

**మంత్రాలయం రూరల్, మేజర్ న్యూస్ :** క్రైస్తవ సోదరులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని మాజీ కెడిసిసి బ్యాంకు చైర్మన్, రామిరెడ్డి తనయులు, టీడీపీ నాయకులు రాఘవేంద్రరెడ్డి, రఘునాథ్ రెడ్డి, రామకృష్ణారెడ్డిలు అన్నారు. బుధవారం మండల పరిధిలోని మాధవరం గ్రామంలోని సొంత గృహంలో క్రైస్తవ ఫాస్టర్లకు దుస్తుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి టీడీపీ సీనియర్ నాయకులు ఉలిగయ్య, ముత్తురెడ్డి, రామిరెడ్డిలు కూడ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫాస్టర్ల సమావేశంలో నియోజకవర్గంలోని సుమారు 100మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫాస్టర్లు ఏసుక్రీస్తుకు సంబంధించిన కీర్తనలు ఆలపించి బైబుల్ సందేశాలు, ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఈసందర్భంగా 100మంది ఫాస్టర్ల దంపతులకు రామిరెడ్డి తనయులు దుస్తుల పంపిణీ చేసి వారికి విందు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నియోజకవర్గంలోని క్రైస్తవులకు ఏలాంటి సమస్యలు వచ్చిన తాము సహాయ సహకారాలు అందిస్తామని, ఫాస్టర్లు గౌరవించడం వలన, సన్మానించడం వలన తమకు ఎంతో సంతోషంగా ఉంద న్నారు. ఫాస్టర్లు అక్కడున్న నాయకులకు శాలువలు కప్పి పూలమాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాజేష్‌రెడ్డి, రాజారెడ్డి, గోవిందు, సామేల్, రాజు, ప్రేమ్ కుమార్‌తోపాటు మరో 100మంది పాల్గొన్నారు.



ఫాస్టర్లకు దుస్తులను పంపిణీ చేస్తున్న రామిరెడ్డి తనయులు

సూర్య



## మహానంది క్షేత్రానికి వెండి పంచపాత్రలు బహుకరణ

**మహానంది, మేజర్‌న్యూస్‌:** మహానంది పుణ్యక్షేత్రంలో వెలసిన శ్రీ స్వామివారికి వెండి పంచ పాత్రలను బహుకరించారు. బుధవారం ఆలయ ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి చైర్మన్ కొమ్మ మహేశ్వర రెడ్డిలకు హైదరాబాదుకు చెందిన గంటి హరిక్రిష్ణ, పద్మజ దంపతులు ఈ పంచపాత్రలను అందజేశారు. వేద పండితులు రవిశంకర అవధాని సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించి స్వామివారి అభిషేకానికి ఈ పంచపాత్రలు వినియోగించనున్నారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్త గంగిశెట్టి మల్లికార్జున రావు తదితరులు పాల్గొన్నారు.


మహానంది దేవస్థానంలో ఆలయ అధికారులకు పంచపాత్రను అందజేస్తున్న దాతలు

## గ్రామాభివృద్దే ధ్యేయంగా అడుగులు వేస్తున్న కోటపాడు గ్రామ సర్పంచ్


చేతిపంపు రిపేరి చేపిస్తున్న దృశ్యం

**శిరువెళ్ల, మేజర్‌న్యూస్ :** శిరువెళ్ల మండల పరిధిలోని కోటపాడు గ్రామంలో ప్రభుత్వ నిధులు ఎపుడు వస్తాయో తెలియదు కాని గ్రామ అభివృద్దే ధ్యేయంగా కోటపాడు గ్రామ సర్పంచ్ వుశేన్‌బీ, గుర్రప్ప ముందుగా అడుగులు వేస్తున్నారు. గ్రామంలో ఏ చిన్న సమస్య వ చ్చినా తమ ఇంట్లో సమస్య మాదిరిగా అనుకొని ఆ సమస్యను పరిష్కరించడానికి సొంత నిధులను వెచ్చించి హుటాహుటినా ఆ సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించే ముఖ్య ఉద్దేశ్యంగా పెట్టుకున్నారు. ఎస్‌సీ కాలనీలో గత పది రోజులుగా మంచినీటి ఎద్దడి ఇబ్బంది పడుతుండడంతో సర్పంచ్ దృష్టికి తీసుకురావడంతో వెంటనే అక్కడ వున్న చేతిపంపుకు మరమ్మతులు చేపట్టి ఎస్‌సీ కాలనీలోని ప్రజలకు మంచినీటి కొరతను తీర్చారు. ఆ సమస్యలను వెంటనే ప పరిష్కరించినందుకు గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ దూదేకుల హుసేన్‌బీ గుర్రప్ప మాట్లాడుతూ గ్రామంలో ఎలాంటి సమస్యలున్నా వీదిలైట్లు, చేతిపంపులు, త్రాగునీటి సమస్యలు ఏవైనా వుంటే తమ దృష్టికి తీసుకువస్తే తక్ష ణమే పరిష్కరిస్తామని గ్రామ ప్రజలకు హామీనిచ్చారు. ప్రజల కష్టాలను తీరుస్తూ గ్రామాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న సర్పంచ్ పనితీరు పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## జీవో నెం.512ని వెంటనే ఉపసంహరించుకోవాలి

### – టీడీపీ పార్లమెంటు అధ్యక్షుడు బీటీ నాయుడు

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి:** భూ యాజమాన్య హక్కు చట్టానికి భంగం కలిగించే జీవో నెం.512ని వెంటనే ఉపసంహరించుకోవాలని తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీటీనాయుడు అన్నారు. కర్నూలు నగరంలోని ధర్నాచౌక్ వద్ద న్యాయవాదులు చేస్తున్న నిరవధిక సమ్మె శిబిరాన్ని రాష్ట్ర టీడీపీ కార్యదర్శి వై.నాగేశ్వరరావుయాదవ్‌తో కలిసి బుధవారం సందర్శించారు. న్యాయవాదుల దీక్షకు సంఘీభావం తెలిపారు. న్యాయవాదులు గత 17రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నా వైసీపీ ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. వెంటనే జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. న్యాయవాదుల సమ్మెకు టీడీపీ సంపూర్ణ మద్ధతు ఉంటుందన్నారు.


మాట్లాడుతున్న బీటీనాయుడు

## ఘనంగా ఎమ్మెల్యే పుట్టినరోజు వేడుకలు


పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

**కల్లూరు, మేజర్‌న్యూస్:** కల్లూరు అర్బన్ పరిధిలోని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి స్వగృహంలో బుధవారం ఆయన పుట్టిన వేడుకలు ఘనంగా జరిగాయి. పాణ్యం నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాల నుంచి తరలివచ్చిన సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, కార్పొరేటర్లు, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎమ్మెల్యే నివసాంలో ఆయనను కలిసి పూలమాలలు, గజమా లలతో సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కల్లూరు రైతు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని సతీసమేతంగా హాజరై ప్రారంభించారు.

# రబీలో రైతులు వరి సాగును విరమించుకోండి

### – రైతులకు కేసీ కెనాల్ అధికారులు సూచన

**బండిఆత్మకూరురూరల్, మేజర్‌న్యూస్ :** రబీలో కేసీ కెనాల్ ఆయకట్టు క్రింద వరిసాగు ఆలోచనను విరమించుకోవాలని కేసీ కెనాల్ అధికారులు రైతులకు సూచనలు చేశారు. బుధవారం మండలంలోని ఈర్నపాడు, పార్నపల్లె తదితర గ్రామాల్లోని రైతులతో కేసీ కెనాల్ ఏఈ మరియు డీఈలు క్షేత్రస్థాయిలో వెళ్లి రైతులతో మాట్లాడారు. రబీలో వరిసాగుకు నీరు ఇవ్వలేమని తక్కువ వర్షపాతం, జలాశయాలలో నీటి నిల్వలు లేకపోవడంతో రెండవ పంటకు సాగునీరు ఇవ్వలేమని తేల్చి చెప్పారు. దిగువ రైతుల కోసం నీటి సరఫరా జరుగుతుందని కేసీ కెనాల్ వెంట విద్యుత్తు మోటార్లు కాని, ఆయిల్ ఇంజన్లు కాని పెట్టుకోవద్దని రైతులకు సూచించారు. తద్వారా దిగువ రైతులకు అందుతుందని అలాగే రైతులు వరిసాగు వేసుకొని నష్టపోవద్దని సూచించారు. బోరు వసతులు వున్న రైతుల మాత్రమే ఆరుతడి పంటలు వేసుకోవాలని, నీటి సౌకర్యం లేని రైతులు వరిసాగు చేయవద్దని నంద్యాల డివిజన్ డీఏఏ రాజశేఖర్ తెలిపారు. ఒకవేళ నీరు అందక వరిపంటలు ఎండి ఓయినట్లయితే ప్రభుత్వం నుండి వచ్చే సంక్షేమ పథకాలు అయిన పంట నష్ట పరిహారం కాని, పంట భీమాకాని అందించడంలో వ్యవసాయ శాఖ బాధ్యత వహించదని ఖరాఖండిగా తెలిపారు. వీరివెంట మండల వ్యవసాయాధికారిణి స్వాతి, వీఏఏలు సామ్రాట్, మంజుల, రైతులు వున్నారు.


రబీ సాగు వద్దని రైతులతో సూచిస్తున్న కేసీ కెనాల్ అధికారులు

## చంద్రబాబుతోనే రాష్ట్రం అభివృద్ధి


గువ్వలకుంట్లలో కరపత్రాలు అందజేస్తున్న తెదేపా నాయకులు

**కొత్తపల్లి, మేజర్‌న్యూస్ :** తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జయసూర్య, మండల కన్వీనర్ నారపురెడ్డిలు తెలిపారు. బుధవారం మండలంలోని నాగంపల్లి గ్రామంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంను నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి తెదేపా మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైకాపా పాలనలో రాష్ట్రం ఎక్కడా అభివృద్ధి చెందలేదని అన్నారు. నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగినట్లు తెలిపారు. పరిశ్రమలు లేక నిరుద్యోగులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. సైకో పాలనకు ప్రజలు స్వస్తి పలకాలని అన్నారు. నంద్యాల పార్లమెంట్ టీడీపీ ఇన్‌చార్జ్ మాండ్ర శివానందరెడ్డి, నందికొట్కూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గౌరు వెంకట్‌రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాల్లో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాబోవు ఎన్నికల్లో ప్రజలు తెలుగుదేశం పార్టీకి అండగా ఉండి గెలిపించాలని అన్నారు. తెలుగుదేశం పార్టీతోనే నిరుపేదలకు న్యాయం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ లింగస్వామి గౌడు, సురేంద్రనాథ్‌రెడ్డి, హరికృష్ణ, వెంకటేశ్వర్లు, నాగేశ్వర్‌రావు, పరశురాములు, స్వాములు, తదితరులు పాల్గొన్నారు.

## మహానంది సన్నిధిలో డీఎఫ్ఓ పూజలు

మహానంది, మేజర్‌న్యూస్‌: ప్రముఖ పుణ్యక్షేత్రమైన మహానందిలో నంద్యాల డీఎఫ్ఓ వినిత్ కుమార్ పూజలు నిర్వహించారు. బుధవారం క్షేత్రానికి వచ్చిన వీరికి ఆలయ మర్యాదలతో ఇన్స్‌పెక్టర్ నాగభూషణం స్వాగతం పలికారు. అనంతరం వారు శ్రీ కామేశ్వరీ సమేత మహానందీశ్వర స్వామివార్లకు అభిషేకార్చణ పూజలు నిర్వహించారు. వేదపండితులు ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేయగా అధికారులు శేష వస్త్రంతో సత్కరించారు. వీరివెంట డీఆర్ఓ హైమావతి పాల్గొన్నారు.


మహానంది క్షేత్రంలో డీఎఫ్ఓను ఆశీర్వదిస్తున్న వేద పండితులు

## జగన్ నైజం... ఎవరినైనా బలి చేయడం

### – ఎన్ఎండి ఫరూక్



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్ఎండి ఫరూక్

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** తన సొంత ప్రయోజనాల కోసం ఎవరినైనా బలిచేయడం జగన్ నైజమని మాజీ మంత్రి తెలుగుదేశం పార్టీ నంద్యాల అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు. బుధవారం టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఫరూక్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ చెప్పేదొకటి, చేసేదొకటని రాష్ట్ర ప్రజలకు అడుగడుగునా మోసాలు చేశాడన్నారు. ఓట్లేసి గెలిపించిన పులివెందుల ప్రజల ముందుకు పరదాలు కట్టుకుని తిరిగే పరిస్థితి వచ్చిందని ఎత్తుకుని పెంచిన చిన్నాన్నను కిరాతకంగా హత్యచేసిన నేరస్తులను కాపాడుతూ తల్లి, చెల్లిని సైతం తరిమేసి ద్రోహం చేశాడన్నారు. కడప స్టీల్ ప్లాంట్ ఊసేలేదని అన్నమయ్య జిల్లా డ్యాం బాధితులను నట్టేట ముంచాడని, కృష్ణా, తుంగభద్ర జలాలపై హక్కులను దారాదత్తం చేసి రాయలసీమ ప్రాజెక్టులకు ద్రోహం చేశాడని తెలిపారు. యువతకు జాబ్ క్యాలెండర్ ఇస్తానని, ఉద్యోగులకు సీపీఎస్ రద్దు చేస్తానని మోసం చేశాడని మద్యనిషేధం చేసి ఓట్లు అడుగుతానని నమ్మబలికి మద్యం ఆదాయాన్ని బ్యాంకులకు తాకట్టుపెట్టి నాసిరకం మద్యం పోసి మహిళల మాంగల్యాలు తెంచుతూ ప్రతివర్గాన్ని ప్రతి మనిషిని నమ్మించి మోసం చేసిన ఘనత జగన్‌కు దక్కుతుందన్నారు. రాష్ట్ర ప్రజలు జగన్ ఛీకొట్టి తరమడానికి మూడు నెలలు సమయమే ఉందని రానున్నది తెలుగుదేశం ప్రభుత్వమే అన్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు ఖలీల్, మైనారిటీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి ముల్లా అలియాస్ తదితరులు పాల్గొన్నారు.

### అంగన్వాడీల సమస్యలపై స్పందించకపోతే

# సమ్మె ఉధృతం చేస్తాం

### – వైసిపి యువ నాయకులు కార్తీక్‌రెడ్డికి వినతిపత్రం

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్:** అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సమ్మె చేపట్టినా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తు పట్టించుకోవడ లేదని, ఇప్పటికైనా స్పందించి అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కరించకపోతే సమ్మెను మరింత ఉధృతం చే స్తామని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్, సిఐటియు పట్టణ కార్యదర్శి రామనాయక్ , ఉపాధ్యక్షులు రణధీర్, అంగన్వాడీ వర్కర్స్ , హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి మంజుల, లక్ష్మిదేవి, తులసమ్మ, వెంకట రవణమ్మలు అన్నారు. బుధవారం ఆత్మకూరు, వెలుగోడు, బండిఆత్మకూరు మండలాలకు చెందిన అంగన్వాడీలు సమ్మె చేపట్టిన అనంతరం ఎమ్మెల్యే కార్యాలయం వద్దకు ర్యాలీగా వెళ్లి తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని యువ నాయకులు శిల్పా కార్తీక్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీల న్యాయమైన కోర్కెలు పరిష్కరించేంత వరకు సమ్మెను విరమించేది లేదని, ప్రభుత్వం స్పందించక పోతే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని అన్నారు. శాంతియుతంగా సమ్మె చేస్తు న్యాయపరమైన తమ సమస్యలు పరిష్కరించమని కోరుతుంటే రెచ్చగొట్టే విధంగా ప్రభుత్వం వ్యవహ రించడం సరి కాదని, స్పందించకపోతే గద్దె దించుతామని అన్నారు. కనీస వేతనం, రిటైర్మెంట్ బెనిఫిట్స్ సౌకర్యం కల్పించాలని , అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులు గుర్తించాలని , న్యాయపరమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకురాళ్లు ప్రమీలమ్మ, విజయలక్ష్మి, వెంకటలక్ష్మి, రవణమ్మ, చెన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.


వైసిపి యువ నాయకులు శిల్పా కార్తిక్‌రెడ్డికి వినతి పత్రం సమర్పింస్తున్న అంగన్వాడీలు

# నమ్మక ద్రోహానికి మారుపేరు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి

- జగన్ స్వప్రయోజనాల కోసం రాష్ట్రం తాకట్టు
- ఆస్తిలో వాటా అడిగారని సొంత తల్లిని, చెల్లిని తరిమేసారు
- ఐదేళ్లు కావస్తున్న ఒక్క కంపెనీ రాష్ట్రానికి రాలేదు
- శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి


సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తున్న బుడ్డా రాజశేఖర్‌రెడ్డి

**వెలుగోడు, మేజర్‌న్యూస్ :** నమ్మక ద్రోహానికి మారు పేరు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం వెలుగోడు ద్వారకా నగర్ కాలనీలో బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. విలేఖరులతో బుడ్డా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ 57 నెలల పాలనలో విశ్వసనీయత లేని వ్యక్తిగా జగన్మోహన్‌రెడ్డి గుర్తింపు పొందారని వాడుకోవడం వదిలేయడం ఆయన నైజం అని అన్నారు. తన ప్రయోజనం కోసం ఎవరినైనా బలిపెడతారని విమర్శించారు. వైఎస్సార్ కుటుంబాన్ని ఆదరించి ఏళ్ల తరబడి ఓట్లు వేసి గెలిపించిన పులివెందుల వాసులకు ఏమీ చేయకుండా నమ్మక ద్రోహం చేశారని అన్నారు. రాజకీయ భవిష్యత్తు ఇచ్చిన బాబాయిని హత్య చేసిన నేరస్తుడిని కాపాడుతూ సభ్య సమాజం తలదించుకునేలా చేశారని ఆరోపించారు. స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయకుండా మోసం చేశారని అన్నమయ్య డ్యామ్‌ను పట్టించుకోకుండా నయవంచనకు పాల్పడ్డారని అన్నారు. తన బినామీ ఆస్తులను కాపాడుకునేందుకు పొరుగు రాష్ట్రంతో మంతనాలు కుదుర్చుకుని కృష్ణ, తుంగభద్ర జలాలను దారాదత్తం చేశారని అన్నారు. రాయలసీమ ప్రాజెక్టులకు ద్రోహం చేసి చరిత్ర హీనుడిగా నిలిచారని అన్నారు. ఆస్తిలో వాటా అడిగారనే కోపంతో సొంత చెల్లిని ఇంటి నుంచి తరిమేశారని అన్నారు. కూతురుకు ఇవ్వాల్సిన వాటాని అడిగిన తల్లిని దూరం పెట్టిన నీచుడు జగన్మోహన్‌రెడ్డి అని విమర్శించారు. ఎమ్మెల్యేలుగా గెలిచిన వారికి కనీసం కలిసేందుకు సమయం ఇవ్వకుండా కొంత మందిని నియోజకవర్గాలు మారుస్తున్న నమ్మక ద్రోహి అన్నారు. తన కేసుల కోసం విభజన హామీలు, పోలవరం, రాజధాని గురించి కేంద్ర ప్రభుత్వాన్ని అడుగకుండా సొంత లాభం చూసుకున్నారని అన్నారు. అమరావతి మహిళా రైతులను పోలీసులతో కొట్టించి అవమానపరిచి రాజధానిని మార్చబోనని మోసం చేశారని అన్నారు. పలు సంక్షేమ పథకాలలో జరిగిన అవకతవకలను వివరించారు. చివరికి ప్రశాంత్ కిషోర్ నమ్మకాన్ని కోల్పోయిన ఆయనకు విశ్వసనీయత లేదని అందుకే జగన్‌ని ప్రజలు నమ్మక ద్రోహి అంటున్నారని అన్నారు. రాష్ట్రంలో నిరంకుశత్వం రాజ్యమేలుతుందని ఇంతటి క్రూరమైన పాలనను మునుపెన్నడు చూడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు కరవయ్యాయని అభివృద్ధి కనిపించడం లేదని రాష్ట్రానికి ఏ ఒక్క కంపెనీ రాలేదని అన్నారు. ప్రజాధనం పూర్తిగా దుర్వినియోగం అవుతోందని ఆరోపించారు. అందరి నమ్మకాన్ని కోల్పోయిన జగన్మోహన్‌రెడ్డిని వచ్చే 2024 ఎన్నికల్లో ఇంటికి పంపించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. టీడీపీని అధికారంలోకి తీసుకువచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల తెదేపా నాయకులు, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## కోవిడ్ జెఎన్.1 పరీక్ష కేంద్రాలు ప్రారంభం


మాట్లాడుతున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ వెంకటరంగారెడ్డి

**కర్నూలు క్రైమ్, మేజర్‌న్యూస్:** కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో కోవిడ్ జెఎన్.1 పరీక్ష కేంద్రాలు ప్రారంభమైనట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి తెలిపారు. బుధవారం జీజీహెచ్‌లోని పీడియాట్రిక్, మెడికల్ విభాగం ఓపీ.9 విభాగాల్లో కోవిడ్ పరీక్ష కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు. ఆసుపత్రిలోని ఎఫ్ఎంసీ విభాగంలో 45పడకల విభాగాన్ని సిద్ధం చేసి అందుబాటులోకి తెచ్చామన్నారు. కోవిడ్ కేసుల నుంచి ఎటువంటి భయాందోళన పడాల్సిన అవసరం లేదన్నారు. ఎవరికైనా సింప్తమాటిక్ ఛేంజస్ ఉంటే వాళ్లకు హోమ ఐసోలేషన్, మిగతా ఎవరికైనా క్రిటికల్‌గా ఉన్నవాళ్ళకి అడ్మిషన్ చేసి వాళ్లకి ట్రీట్‌మెంట్ అందిస్తానని తెలిపారు. బుధవారం కోవిడ్ జెఎన్.1తో కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో ఇద్దరు చేరడంతో వారికి ప్రత్యేక చికిత్స చేయిస్తున్నామని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మాస్కులు ధరించాలని, గుంపులు గుంపులుగా ఉండరాదని ఆయకోరారు. ఈ కార్యక్మరంలో డాక్టర్లు వెంకటేశ్వరరావు, మహేశ్వరరెడ్డి, విజయానందబాబు, దామాం శ్రీనివాసులు, వీరకుమార్, శివబాలనగాంజన్, సునిల్‌ప్రశాంత్ పాల్గొన్నారు.

## సజ్జలను కలిసిన సిహెచ్.మద్దయ్య


సజ్జల రామక్రిష్ణారెడ్డితో సిహెచ్.మద్దయ్య

**కోడుమూరు, మేజర్‌న్యూస్:** రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడైన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామచంద్రారెడ్డిని వైసీపీ నాయకులు సిహెచ్.మద్దయ్య బుధవారం కలిశారు. బాబాసాహెబ్ డాక్టర్ బి.అంబేద్కర్ స్మృతివనం ప్రారంభోత్సవ సన్నాహక సమావేశంలో సజ్జల రామక్రిష్ణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. 2024 ఎన్నికల్లో కోడుమూరు అసెంబ్లీ నియోజకవర్గ వైసీపీ అభ్యర్థిగా తనను పరిగణలోకి తీసుకోవాలని కోరినట్లు సమాచారం. నియోజకవర్గంలో అన్ని మండలాల్లో తనకు బంధు వర్గం ఉందని తెలియజేసినట్లు తెలిసింది.

## బాబు పాలనలోనే ప్రజా సంక్షేమం

**కోడుమూరు, మేజర్‌న్యూస్:** బాబు పాలనలోనే ప్రజా సంక్షేమం ఉండేదని టీడీపీ మండల కార్యదర్శి కోట్ల కవితమ్మ అన్నారు. బుధవారం మండల పరిధిలోని వర్కూరు గ్రామంలో బాబుష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కోట్ల కవితమ్మ మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో ప్రజలు సురక్షితంగా ఉండేవాన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు రక్షణ కరువైందన్నారు. ఈ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. ఈ కార్యక్రమంలో రవిగౌగడ్, ఐటీడీపీ శ్రీనివాసనాయుడు పాల్గొన్నారు.


ప్రజలతో మాట్లాడుతున్న కోట్ల కవితమ్మ

### సమస్యలను పరిష్కరించడానికే
## గడప గడపకు మన ప్రభుత్వం : ఎమ్మెల్యే


లబ్ధిదారులకు బుక్‌లేట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే

**మంత్రాలయం రూరల్, మేజర్‌న్యూస్ :** సమస్యలను పరిష్కరించడానికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రామచంద్ర నగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేతోపాటు కాచాపురం సర్పంచు జయమ్మ, మహిళ నాయకురాలు ప్రీయంక వేర్వేరుగా గడప గడపకెళ్ళి సంక్షేమ పథకాల లబ్ది గురించి లబ్దిదారులను అడిగి తెలుసుకున్నారు. ఇండ్ల స్థలాలు లేనివారి కోసం భూమి కొనుగోలు చేసి పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఇబ్బందిగా ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో త్వరలో చేయిస్తామన్నారు. గడప గడప కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు బీమ్‌రెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, సిఐ శ్రీనివాసులు, ఎస్.ఐ వేణుగోపాల్ రాజ్, సర్పంచు భీమయ్య, ఎంపిడి మణిమంజిరి, ట్రాన్స్ కో ఎఈ గోవిందు, ఏఓ గణేష్, నాయకులు మల్లికార్జున, వైస్ ఎంపిపి రాఘవేంద్ర, బొంబాయి శివ, రాము, అబ్రహాం, వీరారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## కబడ్డీ విజేత ఎన్.కొంతలపాడు

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్:** మండల పరిధిలోని పూడిచెర్ల గ్రామంలో క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని ఏబీఎం చర్చి సంఘ పెద్దల ఆధ్వర్యంలో అంతర్‌రాష్ట్రస్థాయి పురుషుల కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మొదటి స్థానంలో ఎన్.కొంతలపాడు జట్టు నిలిచింది. మొదటి బహుమతిగా రూ.20వేలు అందజేశారు. రెండు, మూడు, నాల్గవ స్థానాల్లో నిలిచిన జట్లకు రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏబీఎం చర్చి సంఘ పెద్దలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


బహుమతులు అందజేస్తున్న దృశ్యం

### ఉస్మానియా కళాశాలలో
## అవగాహన కార్యక్రమం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్:** నగరంలోని ఉస్మానియా కళాశాల మహిళా విభాగంలో బుధవారం వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థి దశలోనే ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని ఆ దిశగా అడుగులు వేయాలని అసెంచర్ టెక్నాలజీస్ సీనియర్ మేనేజర్ అర్షియానశ్రీన్ అన్నారు. ప్రతి విద్యార్థికి ఒక ప్రత్యేకమైన నైపుణ్యం సహజంగానే ఉంటుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ సమీవుద్దీన్ ముజమ్మిల్ మాట్లాడుతూ తల్లిదండ్రులకు నిజమైన సంతోషం తమ సంతానం విజయం సాధించినప్పుడే లభిస్తుందన్నారు. అనంతరం విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా కళాశాల అధ్యాపకులు అన్వర్‌హుసేన్, బీబీనవాజ్, పూర్వ ప్రిన్సిపాల్ హబీబుల్లాబేగ్ పాల్గొన్నారు.

## యువకుల్లో క్రీడా స్ఫూర్తిని పెంచేందుకు కార్తీక్ ప్రీమియర్ లీగ్

### జనవరి 6 నుంచి ప్రారంభం – యువనేత శిల్పా కార్తీక్‌రెడ్డి


కార్తీక్ ప్రీమియర్ లీగ్‌కు పంపిణీ చేసేందుకు సిద్ధం చేసిన కిట్లు

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్:** యువకుల్లో క్రీడాస్ఫూర్తిని పెంచేందుకు...వారిలో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కార్తీక్ ప్రీమియర్ లీగ్ పోటీలను ప్రారంభిస్తున్నట్లు శ్రీశైలం నియోజకవర్గ వైయస్సార్‌సీపీ యువతనేత శిల్పా కార్తీక్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని పద్మావతినగర్‌లోని పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర రాష్ట్రంలో ఒక పండుగలాగా జరుగుతున్నదని తెలిపారు. ముఖ్యమంత్రి యువకుల్లో క్రీడాస్ఫూర్తిని నింపేందుకు యువతలో దాగివున్న ప్రతిభను మెరుగుపరిచేందుకు గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రీడా పోటీలను నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలలో పాల్గొనే అవకాశం కల్పించేందుకు ఆడుదాం ఆంధ్ర పోటీలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. యువకుల్లో ఆసక్తి చూపిస్తున్నారని విశేష స్పందన లభిస్తుందన్నారు. సీఎం శ్రీశైలం నియోజకవర్గంలోని అన్ని మండలాల పరిధిలో ప్రతిభ కలిగిన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కార్తీక్ ప్రీమియర్ లీగ్ పోటీలను జనవరి 6వ తేదీ నుంచి క్రికెట్ పోటీలతో ప్రారంభమై కబడ్డీ, బ్యాడ్మింటన్, ఖోఖో, వాలీబాల్ పోటీలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ పోటీలలో విజేతలకు నగదు బహుమతులు, ట్రోఫీలను అందజేస్తామని తెలిపారు. క్రికెట్ తప్ప మిగతా పోటీలలో స్త్రీ, పురుషులు పాల్గొనవచ్చున్నారు. ఈకార్యక్రమంలో ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళరెడ్డి, మహానంది దేవస్థానం చైర్మన్ మహేశ్వరరెడ్డి, బండి ఆత్మకూరు మండలాధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

# మిరప పంటకు రూ.లక్ష నష్ట పరిహారం ఇవ్వాలి

**– సాగునీరు అందక ఎండిన మిరప పంట**
**– వాటర్ ట్యాంకులతో పంట పొలానికి నీళ్లు**




**వాటర్ ట్యాంకులద్వారా పంట పొలాలను చూపిస్తున్న తిక్కారెడ్డి**

**మంత్రాలయం రూరల్, మేజర్ న్యూస్ :** మిరుప పంట నష్టపోయిన రైతుకు రూ.లక్ష నష్ట పరిహారం ఇవ్వాలని టీడీపీ ఇంచార్జీ తిక్కారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మంత్రాలయం మండల పరిధిలోని మాలపల్లె గ్రామంలో సాగునీరందక ఎండిపోయిన పంట పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వాటర్ ట్యాంకులతో మిరుప పంటకు నీటిని అందిస్తున్న విధానాన్ని పరిశీలించారు. వాటర్ ట్యాంకులతో పెళ్ళిళ్లకు, శుభ కార్యాలకు తాగునీరందించడం చూశాం కానీ, మిరుప పంటకు వాటర్ ట్యాంకులతో నీటిని తోడే విధానాన్ని మన నియోజకవర్గంలోని చూస్తున్నామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎత్తిపోతల పథకాలు ఉన్న మోటార్లు చెడిపోయిన వైసీపీ నాయకులు, అధికారులుగాని పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పంట నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ టీడీపీ నాయకులు సత్యనారాయణరెడ్డి, ఎల్లారెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, చావిడి వెంకటేష్, గోపాల్ రెడ్డి, చంద్ర, భీమన్న, అబ్దుల్, పవన్ కుమార్, కేశన్న, రోగెప్పు, నరసింహులు, జనసేన నాయకులు ఏసేపు, చిదానంద, సల్మాన్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

# కర్నూలు ఎమ్మెల్యే ఇంటిని ముట్టడించిన అంగన్‌వాడీలు

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** అంగన్‌వాడి ఐక్య కార్యచరణ రాష్ట్ర సంఘాల పిలుపు మేరకు కర్నూలులో 16రోజు సమ్మెలో భాగంగా బుధవారం కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ ఇంటిని అంగన్‌వాడి కార్యకర్తలు, కార్మిక సంఘాల నాయకులు ముట్టడించారు. అంగన్‌వాడి సమస్యల పరిష్కారం పట్ల సీఎం జగన్ నిర్లక్ష్య వైఖరిని నశించాలంటూ నినాదాలు చేశారు. ఇచ్చిన హామీ ప్రకారం అన్ని డిమాండ్లను నెరవేర్చాలన్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్యే బయటకు వచ్చి అంగన్‌వాడి కార్యకర్తలతో మాట్లాడారు. మీ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు నిర్మలమ్మ, మునెప్ప, చంద్రశేఖర్, రామాంజనేయులు, గోపాల్, నరసింహులు, రఫి, రేణుక, రాధిక, సునంద పాల్గొన్నారు.



**మాట్లాడుతున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్**

# ఎన్నికల సమయం సమీపిస్తుంది..డీఎస్పీ సీతారామయ్య

**- అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు**
**- పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన డీఎస్పీ**



**గోనెగండ్ల మండలం అగ్రహారం గ్రామస్థులతో మాట్లాడుతున్న డీఎస్పీ సీతారామయ్య**

**గోనెగండ్ల,మేజర్ న్యూస్:**ఎన్నికలు సమీపిస్తున్నాయి పోలీసులు నిబంధనల ప్రకారం ప్రజలు నడుచుకోవాలి అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ సీతారామయ్య అన్నారు. బుధవారం మండల పరిధిలోని అగ్రహారం గ్రామంలో ఆయన పర్యటించారు. గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలోని సౌకర్యాలపై అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రంలో ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.గ్రామ ప్రజలతో మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్నందున గ్రామాల్లో పర్యటిస్తున్నామని అల్లరి మూకలు ప్రవర్తనను మార్చుకొని నడుచుకుంటే మంచిదన్నారు. లేక పోతే పోలీస్ చర్యలు తప్పవని సూచించారు.అసాంఘిక కార్యకలా పాలకు పాల్పడిని వారి పేర్లు పోలీసులకు తెలియజేయాలన్నారు. చిన్న చిన్న సమస్యలు ఉంటే అగోడవలు పెద్దవి కాకుండా చూసుకోవాలని కోరారు. రాబోయే ఎన్నికలు ప్రశాం తంగా జరిగేందుకు ప్రతి ఒక్కరు పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐ మోహన్ రెడ్డి, ఎస్ఐ తిమ్మారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# 16వ రోజుకు చేరుకున్న అంగన్‌వాడీవర్కర్లు, హెల్పర్ల సమ్మె

**వెల్దుర్తి, మేజర్‌న్యూస్ః** తమ సమస్యలను పరిష్కరించాలని, వేతనం పెంచాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఏపి అంగన్‌వాడివర్కర్లు, హెల్పర్లు చేపడుతున్న నిరసన సమ్మె బుధవారం నాటికి 16వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్‌వాడి వర్కర్లు, హెల్పర్లు, యూనియన్ నాయకులు చెడు వినకు, చెడు చూడకు, చెడు మాట్లాడకు అంటూ వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. అంగన్‌వాడి వర్కర్లు చేస్తున్న సమ్మెకు కాంగ్రెస్ పార్టీ మాజీ మంత్రి మారప్ప, మండల కాంగ్రెస్ పార్టీ అద్యక్షుడు ఖాదర్‌వలీలు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి వర్కర్ నాయకురాలు ఈదమ్మ, వెల్దుర్తి, క్రిష్ణగిరి ప్రాజెక్ట్ అంగన్‌వాడి వర్కర్లు, హెల్పర్లు నాయకురాలు చాందినీ, సుజాత, సాలమ్మ, విజయలక్ష్మి, జయలక్ష్మి, వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.



**సమ్మెకు సంఘీబావం తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు**

# జనవరి 22న ఓటర్ల తుది జాబితా ప్రచురణ

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి:** ఓటర్ల తుది జాబితా జనవరి 22న ప్రచురించడం జరుగుతుందని జిల్లా రెవెన్యూ అధికారి కె.మధుసూధన్ రావు తెలిపారు. బుధవారం స్పెసల్ సమ్మరీ రివిజన్–2024లో భాగంగా వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో డీఆర్‌వో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌వో మాట్లాడుతూ క్లెయిమ్స్, డిస్పోజల్స్ డిసెంబర్ 26వతేదీకి పూర్తి చేసి ఓటర్ల జాబితా జనవరి 5న పూర్తి చేయాలన్నారు. కానీ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు క్లెయిమ్స్, డిస్పోజల్స్‌ను 2024 జనవరి 12న పూర్తి చేసి 22న ఓటర్ల తుది జాబితా ప్రచురించడం జరుగుతుందన్నారు. ఎలాంటి సమస్య ఉన్నా రాతపూర్వకంగా తెలియజేస్తే వాటిని పరిష్కరిస్తామన్నారు. ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మురళి, బీజేపీ, టీడీపీ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



# సిఎస్ఐ చర్చి నిర్మాణానికి రూ.50 వేలు విరాళం

**విరాళంగా ఇచ్చిన కస్టమ్స్ ఆఫీసర్ వేల్పుల.ఆనంద్ కుమార్**



**పాములపాడు, మేజర్ న్యూస్ :** పాములపాడుమండలం,బానకచర్ల గ్రామంలోని సిఎస్ఐ చర్చి నిర్మాణానికి కస్టమ్స్ ఆఫీసర్ వేల్పుల.ఆనంద్ కుమార్ 50 వేల రూపాయలు విరాళంగా ఇవ్వడం జరిగింది.ఆయన నందికొట్కూరు నియోజకవర్గంలోని అన్ని మండలాలలో గత సంవత్సర కాలంగా రాజకీయాలకతీతంగా, కుల మతాలకు అతీతంగా ప్రజలకు సహాయ, సహకారాలను అందిస్తున్నారు. కస్టమ్స్ ఆఫీసర్ వేల్పుల.ఆనంద్ కుమార్ నియోజకవర్గంలో ఆప్తులను,అన్నార్తులను ఆదుకుంటూ తరదైన శైలిలోసమాజసేవా కార్యక్రమాల ద్వారా మంచి పేరు,ప్రఖ్యాతలు, అందరి అభినందనలు పొందడం జరిగింది.ఈ కార్యక్రమంలో కస్టమ్స్ ఆఫీసర్ వేల్పుల.ఆనంద్ కుమార్ యువ సైన్యం గట్టు శంకర్ గౌడ్, డాక్టర్.బత్తుల. సంజీవ రాయుడు. ఆర్.ఎల్లా గౌడ్. జి.సిద్దు గౌడ్. ఆర్.గోవింద్ గౌడ్. ఎం.వినోద్, కృష్ణానగర్ రామకోటి నాయక్, శ్రీనివాసులు గౌడ్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మా కడుపులు కొట్టకండి.. నిర్మాణానికి అనుమతులు ఇవ్వకండి

**వెల్దుర్తి, మేజర్‌న్యూస్ః** గత 60 సంవత్సరాలుగా వెల్దుర్తి మేజర్ గ్రామ పంచాయితీలోని పాతబస్టాండ్ నందు రోడ్డుకు ఇరువైపులా తోపుడు బండ్లు ఏర్పాటు చేసుకొని చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవిస్తున్నామని, కాని మండలానికి చెందిన బీజేపి నాయకులు బుధవారం మా వ్యాపారాలకు అడ్డుగా బీజేపి జెండా కట్టను నిర్మించడానికి పూనుకున్నారని, అయితే మా వ్యాపారాలకు అడ్డుగా ఎటువంటి నిర్మాణ చేయకూడదని మేము అడ్డుపడగా మమ్ముల్ని బెదిరించి, ఎవ్వరికి చెప్పుకుంటారో చెప్పుకోండన్నారని, కావున మా వ్యాపారాలకు అడ్డుగా నిర్మించబోయే బీజేపి జెండా కట్టను నిర్మించకుండా చర్యలు తీసుకోవాలని వెల్దుర్తి మండల ఎస్సైకు, మేజర్ గ్రామ పంచాయితీ కార్యదర్శికి చిరువ్యాపారస్తులు వినతిపత్రం సమర్పించారు.



**ఎస్సై పి.చంద్రశేఖర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న చిరువ్యాపారస్తులు**

# బాధితుడికి సిఎం రిలీఫ్ ఫండ్ అందజేత



**బాధితుడు హనుమదాసుకు చెక్కును అందిస్తున్న నాయకులు**

**డోన్, మేజర్‌న్యూస్ః** గత కొంతకాలం క్రితం కర్నూలు నుండి డోన్‌కు వస్తున్న సమయంలో పట్టణానికి చెందిన కాంట్రాక్టర్ వడ్డె హనుమదాస్ రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో బ్రెయిన్ స్ట్రోక్ అయి కోలుకోని రావడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్థికశాఖమంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదేశాలనుసారం సిఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.1,50,000ల చెక్కును బుధవారం పట్టణంలోని వైయస్ ఆర్ పార్టీ కార్యాలయం నందు బాదితుడు వడ్డె హనుమదాస్‌కు అందజేయడం జరిగింది. చెక్కును అందించిన వారిలో ఏపి మీట్ కార్పోరేషన్ చైర్మన్ ఎం.శ్రీరాములు, పార్టీ ఆఫీస్ ఇంచార్జ రాజేంద్రనాథ్‌రెడ్డి, డోన్ మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికే హరికిషన్, నంద్యాల జిల్లా బీసిసెల్ వైకాపా అధ్యక్షులు పోస్టు ప్రసాద్, వైకాపా పట్టణ అధ్యక్షులు కురుకుంద హరి, 16వ సచివాలయ కన్వీనర్ వడ్డె రంగస్వామి, 14వ సచివాలయ కన్వీనర్ గోపిరెడ్డిలు ఉన్నారు.

# బొమ్మిరెడ్డిపల్లె గ్రామంలో పట్టపగలుచోరి

**వెల్దుర్తిరూరల్, మేజర్‌న్యూస్ః** మండల పరిధిలోని బొమ్మిరెడ్డిపల్లె గ్రామంలో పట్టపగలే చోరి జరిగన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన గొల్ల లాకన్న కుమారుడు ఎల్లరాముడు ఇంట్లో ఎవ్వరు లేని సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి 8 తులాల బంగారంతోపాటు నగదును దోచుకెళ్ళినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న ఎస్సై పి.చంద్రశేఖర్‌రెడ్డి తన సిబ్బందితో కలిసి గ్రామానికి చేరుకొని విచారణ చేపట్టారు. అంతలోనే పోలీసు క్లూస్ టీం గ్రామానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు.



**చోరికి గురైన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు**

# నిరుద్యోగుల ఆగ్రహానికి గురికాక తప్పదు

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్:**

రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ నిర్వహించకుంటే నిరుద్యోగుల ఆగ్రహానికి గురికాక తప్పదని టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప అన్నారు. నగరంలోని బుధవారం బిర్లా కాంపౌండ్ కార్యాలయంలో ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాగిరి చంద్రప్ప మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో నిరుద్యోగుల హామీల వర్షం కురిపించారని, అయితే ఇంతవరకు ఎటువంటి హామీని నెరవేర్చలేదన్నారు. వెంటనే నిరుద్యోగులకు డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఎఫ్ నాయకులు రామరాజు, వెంకటేష్, ప్రకాష్, రాజేంద్ర, శేఖర్, రాజు, మల్లికార్జున, నవీన్, అరుణ్, సంతోష్ పాల్గొన్నారు.

## జనవరి 27న శ్రీ నీలకంఠేశ్వర స్వామి మహారథోత్సవం



రథోత్సవం ఆహ్వాన పత్రికను అందజేస్తున్న దృశ్యం

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** ఎమ్మిగనూరు శ్రీ నీలకంఠేశ్వర స్వామి మహారథోత్సవం జనవరి 27వ తేదీన జరుగుతున్నట్లు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త మాచాని నాగరాజు నీలమురళీధర్ తెలిపారు. శ్రీ నీలకంఠేశ్వర స్వామి వారి మహారథోత్సవం, కళ్యాణం, బ్రహ్మోత్సవాలు కొరకు ఆహ్వాన పత్రికను పురాతన సాంప్రదాయ ప్రకారంగా దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్త, కుర్నికుల బాంధవులు కలసి స్వామి వారిని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ సాంప్రదాయ ప్రకారంగా మొదటి శుభలేఖను కామర్తి చల్లాన్ రాజశేఖర్ ఇంటికి అందించారు. కార్యక్రమంలో మాచాని శివశంకర్, హనుమేషప్ప, హరి శేఖర్, శివకేశవ, సోమేష్, చంద్రశేఖర్, శ్రీకాంత్, వెంకటేశప్పరాజు, గడిగే మోహన్, ఉపేంద్ర, కామర్తి గోవిందప్ప, మల్లికార్జున, సరళ సురేష్, మల్లికార్జున, నాగిరెడ్డి, సల్వాజి లింగన్న, ఈరన్న, పూజారి వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న కాలనీలో నీటి ఎద్దడి



చాగలమర్రిలోని జ్ఞానాపురం రస్తాలో ఉన్న జగనన్న కాలనీ

**చాగలమర్రి,మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న కాలనీ గృహ నిర్మాణ పనులు వేగవంతంగా జరిగి కొందరు లబ్ధిదారులు గృహప్రవేశాలు చేసి అందులో నివాసం ఉంటున్నారు. ప్రభుత్వము జగనన్న కాలనీలలో అన్ని మౌలిక వసతులను కల్పిస్తామని ప్రభుత్వము తెలిపింది. చాగలమర్రిలోని జ్ఞానాపురం వస్తా, కూలూరు వస్తా, కస్తూర్బా గురుకుల పాఠశాల దగ్గర ఉన్న కాలనీలలో బోరింగులు వేసినప్పటికిని అందులో నీళ్లు రాక ఇబ్బందులకు గురవుతున్నారు చాగలమర్రిలోని జ్ఞానాపురం రాస్తాలో ఉన్న జగనన్న కాలనీకి నీటి ఎద్దడి ఎక్కువగా ఉంది. కాలనీలో కరెంటు వసతులు కూడా అరకురాగానే నిర్మించారు. అందులో ఉన్న లబ్ధిదారులు నీటి కష్టాలు ఎదురయ్యాయి. ప్రభుత్వం చేపట్టే సంకల్పం నెరవేరుతుందని ఆశగా ఉన్న లబ్ధిదారులకు నీటి కష్టాలు ఈ రూపంలో ఎదురు కావడం కష్టంగా ఉంది. జగనన్న కాలనీలలో త్వరితగతిన మౌలిక వసతులన్నీ కల్పించి లబ్ధిదారులను ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

## అంగన్‌వాడీలు బర్రెలకు వినతిపత్రం




బర్రెలకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

**గడివేముల, మేజర్‌న్యూస్‌:** అంగన్‌వాడీ కార్యకర్తలు తమ నిరసనలో భాగంగా బుధవారం బర్రెల కు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఆయాల పదోన్నతుల వయో పరిమితి 50 సంవత్సరాలకు పెంపుదల, రాజకీయ జోక్యాన్ని నివారించాలని, మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా గుర్తించి, వేతనాలు ప్రమోషన్లు కల్పించాలని, మెడికల్ లివ్‌ల సౌకర్యం, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రూ.5లక్షల వేతనంలో సగం పించన్ ఇవ్వాలని అంగన్‌వాడి కార్యకర్తలు డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికైనా స్పందించి అంగన్‌వాడి వర్కర్స్ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని లేకపోతే రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి కార్యకర్తలు వసంతలక్ష్మి, రాములమ్మ, రామ చెన్నమ్మ, పుష్ప, లలితమ్మ, లక్ష్మీదేవి, రుక్మిణి, అంగన్‌వాడి వర్కర్స్ అండ్ యూనియన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైద్యశాలను ఆకస్మిక తనిఖీ



రికార్డ్ లను పరిశీలిస్తున్న దృశ్యం

**చాగలమర్రి,మేజర్ న్యూస్ :** చాగలమర్రి పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలను జిల్లా ఆరోగ్య,వైద్య శాఖ పరిపాలన అధికారి చంద్రశేఖర్, డిపిఎంఓ ప్రసాద్‌లు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం 11 వ వార్డులో జరుగుతున్న కుష్టు వ్యాధి గుర్తింపు సర్వేను పరిశీలించారు. ఆయన వెంట వైద్యాధికారి ఇమ్రాన్, హెల్త్ సూపర్‌వైజర్ రామలింగారెడ్డి తదితరులు ఉన్నారు.

## చంద్రబాబుతోనే రాష్ట్ర భవిష్యత్తు

**దేవనకొండ ,మేజర్ న్యూస్ :**

టిడిపి అధినేత మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్ర భవిష్యత్తు అని టిడిపి యువ నాయకులు దేవనకొండ బూత్ ఇన్చార్జీ పి చాంద్ భాష అన్నారు. బుదవారం దేవనకొండలో యస్సీ కాలనీలోని బూత్ నెంబర్ 255,256లో టిడిపి ప్రశేశపెట్టిన బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం అధికారంలోకి వచ్చిన వెంటనే తల్లికి వందనం ద్వారా ప్రతి విధ్యార్థికి ఏడాదికి 15 వేలు,18 యేళ్లు నిండిన ప్రతి మహిళలకు ఆడబిడ్డ నిధి ద్వారా నెలకు 15 వందలు దీపం పథకం ద్వారా ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా పంపిణీతో పాటు పలు సంక్షేమ పతకాలను అమలు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బి రమేష్,రంగయ్య, నాగరాజు,శివప్ప, ముత్యాల రాముడు,అడివప్ప తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న కాలనీలో గృహాలను వేగవంతం చేయండి



మాట్లాడుతున్న డి ఈ నాగరాజు

**చాగలమర్రి, మేజర్ న్యూస్ :** ఆళ్ళగడ్డ నియోజకవర్గంలో ప్రభుత్వం 34 జగనన్న లే-అవుట్లు ఏర్పాటు చేసి 3405 మంది నిరుపేద ఇళ్ళులేని, అర్హత కలిగిన లబ్దిదారులకు ఇళ్ళ పట్టాలు మంజురు చేయడం జరిగిందని జగనన్న కాలనీలో నిర్మించే గృహాల పనులను వేగవంతంచేయాలనిహౌసింగ్ డిఈ నాగరాజు తెలిపారు. ఆయన బుధవారం చాగలమర్రిలోని హౌసింగ్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో వివిధ రికార్డులను పరిశీలించారు. అనంతరంవిలేఖరులతో మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో జగనన్న లే- అవుట్లలో ఇంటి నిర్మాణాలకు ఇప్పటి వరకు లబ్దిదారులకు 162.96 కోట్ల రూపాయలు బిల్లులు చెల్లించినట్లు ఆయన తెలిపారు. స్వంత స్థలాలు ఉన్న వారికి నియోజకవర్గంలో స్వంత స్థలం ఉన్న వారికి సుమారు 3689 మందికి ప్రభుత్వం పక్కా గృహాలను మంజూరు చేసిందన్నారు. వాటిలో 1228 గృహాల నిర్మాణాలు పూర్తికాగా, 1684 బేస్‌ంట్, 246 గృహాలు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయన్నారు. ఒక్కో లబ్దిదారుడికి 1 యూనిట్కు రూ.1.80 లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. దీంతోవారికి మొత్తం రూ.110.11 కోట్లు లబ్దిదారుల ఖాతాల్లో జమా చేసినట్లు ఆయన తెలిపారు. అంతేకాకుండా గృహా నిర్మాణ లబ్దిదారులకు ఉపాధిహామి పథకం క్రింద సుమారు రూ. 94.00 లక్షలు మంజూరైనట్లు డిఈ నాగరాజుతెలిపారు. ఏఈ షఫీవుల్లా.వర్క్ ఇన్‌స్పెక్టర్ సిబ్బంది తదితరులున్నారు.

## జనసేన సిద్ధాంతాలు నచ్చి పార్టీలో చేరిక




పార్టీలో చేరుతున్న దృశ్యం

**ఆళ్లగడ,మేజర్ న్యూస్ :** జనసేన పార్టీ సిద్ధాంతాలు నచ్చి చాగలమర్రి మండలం రాంపల్లెకు చెందిన 12 కుటుంబాలు జనసేన పార్టీలో చేరారని ఆళ్లగడ్డ తాలూకా జనసేన పార్టీ నాయకులు ఇరిగెల రాంపుల్లారెడ్డి, ఇరిగెల సూర్యనారాయణ రెడ్డి లుఅన్నారు. ఆళ్లగడ్డ పట్టణం జనసేన పార్టీ కార్యాలయంలో మేకల రామకృష్ణ ఆధ్వర్యంలో రాంపల్లెకు చెందిన 12 కుటుంబాలు జనసేన పార్టీలో చేరారు. వీరికి తాలూకా జనసేన పార్టీ నాయకులు ఇరిగెల రాంపుల్లారెడ్డి, ఇరిగెల సూర్యనారాయణ రెడ్డిలు కండువా కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఇరిగెల రాంపుల్లారెడ్డి మాత్లాదుతూ త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో జనసేన, తెలుగుదేశం లు కలిసి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. మోహన్ రెడ్డి, పవన్ కుమార్, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, వెంకటరమణ, మహమ్మద్, రఫీ, సాయి, అమర్నాథ్ రెడ్డి, బాబు, ఫక్రుద్దీన్, భార్గవ్ రెడ్డి, ముల్లమాబు వలి తదితరులు జనసేన పార్టీ ఆకర్షలే జనసేన పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పెసరాయి చాంద్ భాష, మిద్దె రాంపుల్లయ్య, పెద్ద బాలయ్య పాల్గొన్నారు.

## కొత్తూరు సుబ్బరాయుడు ఆలయ అభివృద్ధికి రూ.2.50లక్షలు విరాళం




విరాళం అందజేస్తున్న భక్తులు

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్‌:** ప్రముఖ శైవక్షేత్రం లక్షలాది భక్తుల ఆరాధ్య దైవం పాణ్యం మండలం ఎస్.కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీ సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి, అన్నదానం నిమిత్తం రూ. 2.52 వేలు భక్తులు విరాళంగా సమర్పించినట్లు ఆలయ ఈఓ ఎం.రామకృష్ణ బుధవారం తెలిపారు. దేవస్థానం నందు భక్తుల సహకారంతో నిర్మిస్తున్న మహా ప్రాకారంనకు విశాఖపట్టణంనకు చెందిన కొమ్మనాపల్లి సత్యనారాయణ, నాగలక్ష్మి కుమారుడు క్రిష్ణ చైతన్య, కోడలు లక్ష్మి సుమిత్ర కుటుంబ సభ్యులు మహా ప్రాకార నిర్మాణంనకు రూ.2లక్షలు, అన్నదానంనకు రూ.42వేలు విరాళంగా ఆలయ ప్రధాన అర్చకులు సుబ్బ సత్యనారాయణ స్వామికి అందజేశారు. అదే విధంగా తిమ్మాపురంకు చెందిన కర్నూలులో నివాసముంటున్న కీ.శే ఉండాల రామ చంద్రారెడ్డి జ్ఞాపకార్థం ధర్మపత్ని జ్ఞాపకార్థం ఉండాల ప్రమీలారెడ్డి రూ.10,116లు నిత్యాన్నదానంనకు విరాళంగా అందజేశారు. దాతలకు ఆలయ మర్యాదలతో అభిషేకం, అర్చణలు, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం అభిషేక మండపం నందు స్వామివారి శేష వస్త్రాలు, తీర్థ ప్రసాదాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేయాలి

**ఎస్సై అశోక్ అభినందించిన డి.ఎస్.పి శ్రీనివాసరావు**



పరిశీలిస్తున్న డి.ఎస్.పి శ్రీనివాసరావు

**పాములపాడు ,మేజర్ న్యూస్ :** పోలీస్ స్టేషన్‌కువచ్చే బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేయాలని ఆత్మకూరు డిఎస్పి శ్రీనివాసరావు అన్నారు బుధవారం పాములపాడు పోలీస్ స్టేషన్‌ను సామాజిక తనిఖీల్లో భాగంగా పాములపాడు వచ్చారు. పిఎస్‌లో పలు రికార్డులు, స్టేషన్ రైటర్, రిసెప్షన్, లాకప్ రూమ్, సీజ్ చేసిన వాహనాలను స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలు తీర్చాలని బాధితుల ఫిర్యాదుల పట్ల జాప్యం లేకుండా తక్షణమే స్పందించాలన్నారు ప్రతి ఫిర్యాదు పై విచారణ చేసి కేసు నమోదు చేయాలని సూచించారు. పాములపాడులో క్రైమ్ చాలా తక్కువగానే ఉందని యువకులు సైబర్ నేరాలపై జాగ్రత్తగా వహించాలని ఉద్యోగానికి ఇస్తామని ఆన్లైన్లో బయోడేటా అప్ లోడ్ చేస్తున్నారని ముఖ్యంగా చదువుకున్న యువత సైబర్ నేరాలు బారిన పడుతున్నారని ఫోన్ చేసి ఎవరు ఓటీపీలు అడిగినా ఇవ్వకూడదని డిఎస్పి మరోసారి గుర్తు చేశారు 2024 ఎన్నికలకు ముందస్తు చర్యల్లో భాగంగా సమస్యలున్న గ్రామాలపై ప్రత్యేకంగా ఉంచాలన్నారు వేసవికాలం కావడంతో రోడ్డు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సూచనలు చేశారు. బస్సులో వెళ్తుండగా పాములపాడు దగ్గర బంగారు దొంగతనం చేసిన దొంగలను పట్టుకొని వారి నుండి రికవరీ చేసినందుకు ఎస్సై అశోక్ డిఎస్పి అభినందించారు. ఏ ఎస్ఐ యేసయ్య, హెడ్ కానిస్టేబుల్ నూర్ భాషా, రామేశ్వర రావు, రసూల్, ఖాజా, శివ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

## బకాయిలు వెంటనే చెల్లించాలి – యూటిఎఫ్

**బనగానపల్లెరూరల్,న్యూస్‌:** ఆర్థిక బకాయిలు విడుదల చేయాలని యూటిఎఫ్ ఆధ్వర్యంలో మండల అధ్యక్షులు ఎన్. ప్రతాప్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు నిరసన కార్యక్రమం తహశీల్దార్ కార్యాలయం దగ్గర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహ అధ్యక్షులు సత్యప్రకాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులకు ఉపాధ్యాయులకు పెన్షనర్లకు ప్రతి నెల 1వ తేదీన జీతాలు చెల్లించాలని ప్రతి నెల 15వ తేదీ వరకు చాలా మంది ఉద్యోగులకు జీతాలు పడటం లేదని వారు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని సకాలంలో బ్యాంకుల వాయిదాలు చెల్లించలేకపోతున్నారని తెలిపారు. ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులపట్ల నిర్లక్ష్యం వీడాలని బకాయిలు చెల్లించాలని వినతీ పత్రాన్ని తహశీల్దార్‌కు అందివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కన్వీనర్ దస్తగిరి, మండల సహఅధ్యక్షులు క్రిష్ణయ్య, ఆర్థిక కార్యదర్శి విజయ్ కుమార్, జిల్లా కౌన్సిలర్ నాగరాజు, మనోహర్, వీరకుమార్ రెడ్డి, సుధాకర్, కె. గోపాల్ మరియు సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సూర్య

గురువారం | 28 డిసెంబర్ 2023

# ఎల్ఎల్సి కాలువకు నీటిని నిలిపివేసిన డ్యాం అధికారులు

### నిలిచిన రబీ సాగు...

**ఆలూరు, మేజర్‌న్యూస్ :** కర్నూల్ జిల్లా పశ్చిమ ప్రాంతాలైన ఆలూరు, ఆదోని,ఎమ్మిగనూరు నియోజక వర్గాలకు ఎల్ ఎల్ సి నుండి రావాల్సిన సాగు,తాగు నీటిని డ్యామ్ అధికారులు ఈ నెల 25 న నిలిపివేయడంతో కెనాల్ లో నీటి ప్రవాహం నిలిచిపోయింది. కర్నూల్ జిల్లా రైతులకు కల్పతరువు అయిన ఎల్ ఎల్ సి కెనాల్ ద్వారా లక్షల ఎకరాలు సాగులోకి వచ్చేవి అని ఈ ఏడాది డ్యామ్ లో నీరు లేకపోవడంతో అధికారులు నీటిని నిలిపివేశారు. రైతులు తాము రబీ సాగు చేసుకోవాలన్న ఆశలు అవిరయ్యాయి. అలాగే డ్యామ్ అధికారులు ముందుగానే కెనాల్ కింద రబీలో పంటలు సాగు చేసుకోవద్దని రైతులను హెచ్చరించారు.రైతులు కూడా రబీలో పంటలసాగుకు దూరంగా ఉన్నారు.అయితే కర్నూల్ పట్టణంతో పాటు ఆలూరు తదితర ప్రాంతాలకు వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ఫిబ్రవరి ప్రాంతంలో కొద్ది పాటి నీటిని తాగునీటి అవసరాల కోసం విడుదల చేస్తారు. అయితే ఈ సారి తాగునీరు



ఎల్.ఎల్.సి కెనాల్‌లో నిలిచిపోయిన నీరు

కూడా ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొంది. డ్యామ్ పూర్తిస్థాయి నీటిమట్టం 105.788 టీఎంసీ లు కాగా ప్రస్తుతం10.548 టీఎంసీ లు నిల్వ ఉంది.గత ఏడాది ఇదే సమయానికి 79 టీఎంసీ ల నీరు నిల్వవుండేదని ఈ ఏడాది సరైన వర్షాలు లేక డ్యామ్ లో నీరు అట్టడుగు కు చేరే స్థితిలో ఉందని అధికారులు తెలిపారు.అయితే వేసవికి ఏ మాత్రం అధికారులు తాగునీరు అందిస్తారో వేచి చూడాలి.

# భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేయాలి

### – ఎంపీ, ఎమ్మెల్యేలు మౌనంగా ఉండడం తగదు
### – కలెక్టరేట్ ఎదుట రైతుల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** కల్వకుర్తి–నంద్యాల 167 జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన బాధిత రైతులకు ప్రభుత్వం అందిస్తున్న నష్టపరిహారం బయట మార్కెట్ ధరలో సగం కూడా రైతులకు అందడం లేదని అధికారుల ఏకపక్ష ధోరణి వల్ల తీవ్రంగా నష్టపోతున్నామని నంద్యాల మండలం పెద్దకొట్టాల మాజీ సర్పంచ్ జయపాపిరెడ్డి, బాధిత రైతులు మహేష్‌నాయుడు, బిల్లలా పురం రైతులు శ్రీరాములు, గడ్డం మోహన్‌కృష్ణ, కోటేశ్వరరావు, కొత్తపల్లి రైతులు భాస్కర్‌రెడ్డి, సుబ్బరెడ్డి తదితర రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం కలెక్టరేట్ ముందు వందలాది మంది బాధిత రైతులు ధర్నా చేసిన అనంతరం మాట్లాడుతూ జాతీయ రహదారి నిర్మాణం కోసం ప్రభుత్వం భూసేకరణ రైతులకు శాపంగా మారిందని, రైతుల ప్రమేయం లేకుండా జాతీయ రహదారి నిర్మాణం కోసం భూములు తీసుకుంటున్నారని వారు ఆరోపించారు. కనీసం గ్రామ సభలు పెట్టి బాధత రైతుల తో మాట్లాడే తీరిక, ఓపిక రెవెన్యూ, జాతీయ రహదారి అధికారులకు లేదని వారే మా పొలం ధర నిర్ణయించి బ్యాంకులో డబ్బులు జమచేస్తామని తీసుకోవాలని బాధిత రైతులకు నోటీసులు ఇవ్వడం దారుణమన్నారు. జిల్లా కేంద్రం నంద్యాల పట్టణానికి కేవలం రెండు, మూడు కిలోమీటర్ల దూరంలోనే మా విలువైన భూములు జాతీయ రహదారి నిర్మాణంలో పోతున్నా యని ఎకరా పొలం బయట మార్కెట్‌లో రెండు కోట్ల నుంచి 5కోట్ల విలువ ఉందని, ప్రభుత్వం మాత్రం మార్కెట్ విలువ ఆధారంగా ఎకరాకు రూ.3 లేదా 6లక్షలకు నష్టపరిహారం ఇస్తున్నామని నోటీసులు ఇవ్వడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. రైతులకు ప్రభుత్వం ఇంత అన్యాయం చేస్తున్నా ఎమ్మెల్యేలు, ఎంపీ మౌనంగా ఉండడం బాధాకరమన్నారు. మాకు సరైన నష్టపరిహారం చెల్లించకుంటే న్యాయస్థానంను ఆశ్రయిస్తామని బాధిత రైతులు హెచ్చరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ధర్నాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రూరల్ సీఐ దస్తగిరిబాబు, మూడో పట్టణ సీఐ నరసింహులు, ట్రాఫిక్ పోలీసులు అధిక సంఖ్యలో చేరుకుని రైతు ప్రతినిధులతో మాట్లాడి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయడం రైతులు ధర్నా విరమించారు.

# ముగిసిన కబడ్డీ పోటీలు

**కర్నూలు క్రైమ్, మేజర్‌న్యూస్:** దేవనకొండ మండలం తెర్నేకల్లు గ్రామంలో గత రెండురోజులుగా నిర్వహిస్తున్నట్లు కబడ్డీ పోటీలు బుధవారం ముగిశాయి. ఈ పోటీల్లో మొత్తం 34జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో మొదటి స్థానలో జెడ్ టీం కన్నడ, రెండవ స్థానంలో అంకుల్‌స్కై కోస్తా, మూడవ స్థానంలో గోనెగండ్ల, నాల్గవ స్థానంలో చందోలి జట్లు నిలిచాయి. విజేతలుగా నిలిచిన జట్లకు జేసీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ తెర్నెకల్లు సురేందర్‌రెడ్డి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఇలాంటి పోటీలు నిర్వహించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అరుణ్‌కుమార్, ఏబీఎం చర్చి సంఘ పెద్దలు, ఎంపీటీసీ నమ్మాల



బహుమతులు అందజేస్తున్న తెర్నేకల్లు సురేందర్‌రెడ్డి

శ్రీనివాసులు, బెళ్లు ఈరన్న, రాఘవేంద్ర, చాప వీరన్న, హణుమంత, వైసీపీ నాయకులు పులి నరేష్, పీఈటీ మాస్టర్లు నాగేంద్ర,ప్రతాప్, సునిల్, డేవిడ్, సంజీవకుమార్, బిట్టు పాల్గొన్నారు.

### మల్లన్న సేవలో
# దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ

**శ్రీశైలం, మేజర్‌న్యూస్:** శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి (దేవాదాయ శాఖ) కొట్టు సత్యనారాయణ బుధవారం వేకుజామున దర్శించుకున్నారు. ఆలయ రాజగోపురం వద్ద మంత్రి దంపతులకు ఈవో పెద్దిరాజు, అధికారులు,అర్చక స్వాములు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు.ఈ సందర్భంగా మంత్రి దంపతులు స్వామి,అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.



ఆలయ రాజగోపురం వద్ద మంత్రి దంపతులకు స్వాగతం పలుకుతున్న ఈవో

# మల్లన్న సేవలో దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ



కమిషనర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న చైర్మన్,ఈఓ

**శ్రీశైలం, మేజర్‌న్యూస్:** శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లను రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్. సత్యనారాయణ బుధవారం దర్శించుకున్నారు.ఆలయ రాజగోపురం వద్ద కమీషనర్కు ఆలయ ఈవో పెద్దిరాజు, అధికారులు,అర్చక స్వాములు ఆలయం మర్యాదలతో ఆహ్వానం పలికారు.ఈ సందర్భంగా కమిషనర్ స్వామి,అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో వేద పండితులు వేద ఆశీర్వచరులు వల్లించగా ట్రస్ట్ బోర్డు చైర్మన్ రెడ్డివారి చక్రపాణి రెడ్డి,ఈవో పెద్దిరాజు శేష వస్త్రాలు,లడ్డు ప్రసాదాలతోపాటు స్వామి,అమ్మ వార్ల చిత్రపటంతో కమిషనర్ను సత్కరించారు.

### మెగాస్టార్ చిరంజీవి
# సూపర్‌హిట్ యాక్షన్ డ్రామా ఇంద్ర..
### 8ఏళ్ల తర్వాత మళ్లీ మీ జీ సినిమాలో

**కర్నూలు, మేజర్‌న్యూస్ ప్రతినిధి:** తెలుగు టెలివిజన్ ఇండస్ట్రీలో అత్యంత ఆవరణ గల ఛానల్ జీ సినిమాలు. వారం వారం సరికొత్త సినిమాలతో తెలుగు ప్రేక్షకులను అలరిస్తున్న జీ సినిమాలు మెగా బ్లాక్‌బాస్టర్ మూవీ ఇంద్రతో ఈ ఏడాదిని ఘనంగా ముగించేందుకు సిద్ధమైంది. ఇంద్ర సినిమా విడుదలై ఘనవిజయం సాధించి రెండు దశాబ్దాలు పూర్తయింది. మెగాస్టార్ చిరంజీవి, సోనినాబింద్రే జంటగా నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇంద్ర డిసెంబర్ 30న సాయంత్రం 6గంటలకు జీ సినిమాలతో! ఎనిమిదేళ్ల తర్వాత మరోసారి బుల్లితెర ప్రేక్షకులను అలరించేందుకు జీ సినిమాలు వేదికగా ఇంద్ర సినిమా ప్రసారం కానుంది. వైజయంతి మూవీ సమర్పణలో రూపొందిన యాక్షన్ ప్యాక్డ్ చిత్రం ఇంద్ర. రాయలసీమలోని ఫ్యాక్షన్ కుటుంబానికి చెందిన టాక్సీ డ్రైవర్ శంకర్‌నారాయణ్(చిరంజీవిపాత్ర) చుట్టూ తిరిగే ఈ చిత్రం సమాజంలో లోతుగా పాతుకపోయిన శత్రుత్వాన్ని అంతం చేసేందుకు ఇంద్రసేనారెడ్డి చేసిన ప్రయత్నాన్ని చక్కగా చూపిస్తుంది.




ఇంద్ర సినిమా లోగో

### శ్రీశైల మల్లన్నకు
# శాస్త్రోక్తంగా వార్షిక ఆరుద్రోత్సవం



**శ్రీశైలం, మేజర్‌న్యూస్:** శ్రీశైల మల్లన్నకు శాస్త్రోక్తంగా వార్షిక ఆరుద్రోత్సవాన్ని నిర్వహించినట్లు ఆలయ ఈవో పెద్దిరాజు తెలిపారు.ఈ ఆరుద్రోత్సవాన్ని ప్రతి నెలలో మాసోత్సవంగా నిర్వహిస్తుండగా,ధనుర్మాసంలో వచ్చే ఆరుద్ర నక్షత్రం రోజున మాత్రం వార్షిక రుద్రోత్సవంగా జరిపించబడుతోంది. ఈ ఉత్సవాన్ని పురస్కరించుకుని రాత్రి 10 గంటల నుండి శ్రీ స్వామివారికి మహాన్యాస పూర్వక లింగోద్భవకాల రుద్రాభిషేకం, అన్నాభిషేకం, మరుసటి రోజు 6 తెల్లవారుజామున శ్రీస్వామివార్ల ప్రాత:కాల పూజల అనంతరం నందివాహన సేవ, గ్రామోత్సవం జరిపించారు. ఈ కార్యక్రమం నిర్విఘ్నంగా ఉత్సవం జరగాలని ముందుగా గణపతి పూజ జరిపించి తరువాత లోక కల్యాణం కోసం నిర్వహించబడే ఈ ఉత్సవ సంకల్పంలో దేశం సుభిక్షంగా ఉండాలని, దేశంలో సుఖశాంతులు విలసిల్లాలని, అకాల మరణాలు సంభవించకుండా ఉండాలని, జనులందరికీ సుఖసంతోషాలు కలగాలని, సంకల్పం చేయబడుతుంది. అనంతరం మహాన్యాసాన్ని జరిపి శ్రీ స్వామివారికి లింగోద్భవకాల రుద్రాభిషేకం చేయబడుతుంది. పంచామృతాలతోనూ, పలు రకాల ఫలోదకాల తోనూ, ఆలయ ప్రాంగణంలోని మల్లికాగుండ పుణ్యజలంతోనూ ఈ అభిషేకం ఎంతో శాస్త్రోక్తంగా



జరిపించబడింది. ఆలయ అర్చకులు, వేదపండితులు రుద్రమంత్రాలను పఠిస్తూ ఈ అభిషేకాన్ని నిర్వర్తించడం జరిగింది. స్వామివారికి అన్నాభిషేకం జరిపించబడుతుంది. అనంతరం పలు రకాల పుష్పాలతో, బిల్వదళాలతో స్వామివారికి విశేషపూజలు జరిపించారు. కాగా వేకువజామున 3 గంటలకు మంగళ వాయిద్యాల అనంతరం 3.30 ని.లకు సుప్రభాతసేవ నిర్వహించబడుతుంది. తరువాత శ్రీ స్వామివార్లకు ప్రాతఃకాలపూజలను జరిపించిన అనంతరం శ్రీ స్వామివార్ల ఉత్సవమూర్తులను స్వామివారి ఆలయ ముఖ మండపంలో ఉత్తరముఖంగా వేంచేబు చేయించి ప్రత్యేక పూజలు జరిపించి తరువాత ముఖమండప ఉత్తర ద్వారాన్ని తెరచి భక్తులకు ఉత్సవమూర్తుల ఉత్తరద్వార దర్శనం కల్పించారం. ఈ ఉత్సవంలో భాగంగానే ఉత్సవమూర్తులను స్వామివారి ఆలయ ముఖమండప ఉత్తరద్వారం నుండి వెలుపలకు తోడ్కొనివచ్చి ఆలయ ఉత్తరభాగంలోనే నందివాహనంపై ఆశీనులను చేసి ప్రత్యేక పూజలు జరిపించి తరువాత పురవీధులలో గ్రామోత్సవం నిర్వహించి శ్రీస్వామి అమ్మవార్ల గ్రామోత్సవం తదుపరి భక్తులను దర్శనానికి,ఆర్జిత సేవలకు అనుమతించడం జరిగిందని ఈవో పేర్కొన్నారు. ఈ పూజ కార్యక్రమంలో దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అధికారులు,అర్చక స్వాములు తదితరులు పాల్గొన్నారు.